మీ పెరట్లో అన్నీ మీరు వేసిన మొక్కలేనా? ఏ చిలకో, కాకో తెచ్చి పడేసిన గింజ మొలకై, మొక్కై పువ్వులు పూసి, కాయలు కాస్తే అనుభవించటం లేదూ? ఛీ! ఈ విత్తనం నేను వెయ్యలేదని పీకి పారేస్తున్నారా?

ఎవరి పిల్లల్ని వాళ్లు పెంచుకోవడానికి చట్టాలు కావాలా?

మనక్కావాల్సింది చట్టాలు, అనాథ శరణాలయాలు కాదు.

ప్రతి తండ్రికి వీడు నా కొడుకే అని చెప్పుకోగలిగే గుండె నిబ్బరం, ప్రతి తల్లికి మొగుడున్నా లేకపోయినా తన పిల్లల్ని బాహాటంగా పెంచుకోగలిగే మనోధైర్యం.

నీతిని పవిత్రతని, మంచితనాన్ని, చట్టాల చట్రాల్లో బిగించక పోతే గాని వాటికి గతిలేదా?

**(జ్యోతి, 1980)**

# హరిశ్చంద్రమతి

**ఐ** లవ్‌యు డార్లింగ్ అన్నారు మా వారు. ఓనాడు నేను మంచి పన్లో ఉన్నప్పుడు పిలిచి, అనడమే కాకుండా ఆ లవ్వంతా ఏరై ప్రవహించే చూపొకటి చూసేరు. చూపుల డిక్షనరీ వెతికితే నా మాట నమ్మవూ అని ఆ చూపుకర్థంట! బావుంది. దివ్యంగా ఉంది. ఇంత క్లాసిక్ బోర్ విని చాలా కాలమైంది.

అల్లప్పుడెప్పుడో, ఆర్నెల్లక్రితం...

నక్కలు, పసిపిల్లల గోరీలు త్రవ్వేవేళ,

గుడ్లగూబ కలలోకి వచ్చిన పక్షిపిల్లలు కెవ్వున కేకవేసి తల్లి రెక్కల క్రింద నక్కినవేళ.

ఆ పిల్లల్ని చల్లగాలి ఉయ్యాల లూపిన వేళ.

సెలయేరు జోలపాడిన వేళ.

నేను వెన్నెట్లో డాబామీద నా నవల సినిమా కలగంటున్న సుముహూర్తాన.

ఏమిటోనే అమ్మీ. ఈ మధ్య నిన్ను తెగ ప్రేమించేస్తున్నా నుస్మీ అన్నారు మా వారే.

సినిమా సగంలో ఉన్న నాకు మా వారి డైలాగు తెలుగే అయినా అర్థం కాలేదు. ఆయన కలవరిస్తున్నారా!

నేను కలగంటున్నానా!

ఏమిటోనే అమ్మీ! ఈ మధ్య నిన్ను తెగ ప్రేమించేస్తున్నాను మళ్ళీ అదే డైలాగు.

ఈ డైలాగు నా నవలలోనిది కాదు. ఠక్కున కళ్ళువిప్పేను. ఎదురుగా మా వారు. నేనిప్పుడే ఖూనీ చేసేను. నన్ను క్షమించవూ అన్నంత దీనంగా మొహంపెట్టి కూర్చున్నారు.

ఛ! ఛ! కమ్మటి నవల కల పాడైపోయింది.

ఛర్రున కోపం వచ్చింది.

నిక్షేపంలాంటి నిద్రపాడుచేశారు. యీ పాడుమాట చెప్పడానికా! పడుకోండి పడుకోండి ఊరికే చంపక. మీరు ప్రేమిస్తున్నది నన్ను కాదు, ఇదిగో....

ఈ వెన్నెల్ని,

ఈ మంచుని,

ఆ పున్నాగ పువ్వుల్ని,

వాటి కమ్మటి వాసనని,

కన్నె పిల్లల్లా కన్నుకొడుతున్న ఆ లేత నక్షత్రాల్ని "ఎందు కొచ్చిన సొళ్ళు కబుర్లు కాని, అంతగా నిద్రరాకపోతే ఏదైనా పుస్తకం చదువుకోండి" అన్నాను.

కోపంలోనో, కల మైకంలోనే కసిరేనే కాని ఆ తరువాత పాపం చాలా జాలేసింది. అతని చిన్నబోయిన మొహం చూసి

ఏమో! ఒకవేళ నిజమే చెప్పేరేమో!

అంత ఆశతో చెప్పిన మనిషిని మరెప్పుడూ హర్ట్ చెయ్యకూడ దనిపించింది. లేకపోతే అదే డైలాగు యీసారి ఇంగ్లీషులో విన్నప్పుడు మామూలుగానే అయితే.

"బావుంది సార్! మీకేం పన్లేనప్పుడూ, ఏం తోచనప్పుడు నేనెంత పన్లో వున్నా పిల్చి యిలాంటి పిచ్చి మాటలు చెప్పడం వుంది చూసేరూ! బ్రహ్మాండంగా ఉంది. ఎలక్షను స్పీచ్‌లాగ అస్తమానూ అదేమాటా! ప్రియురాలిమీద వుండే దాన్నే ప్రేమ అంటారు. పెళ్ళాంపట్ల వుండేది కేవలం డ్యూటీ. ప్రియురాలే పెళ్ళాం అయితే ప్రేమకూడా డ్యూటీ అయిపోతుంది. పెళ్ళాం ప్రియురాలు అవదు కాబట్టి ఆ రెండో ప్రశ్నేలేదు.

నేనెంత ఫూల్‌నైనా అంతమాత్రం తెలుసు. పోనీ లోక విరుద్ధంగా మీరు నన్ను ప్రేమిస్తున్నారనే అనుకుందాం. అంత

మాత్రాన అదేదో ఎవార్డు విన్నర్లాగ అస్తమానూ పాడక్కర్లేదు. మీరు ప్రేమించినా, మించకపోయినా నేనెక్కడికీ పారిపోను. పెళ్ళైన కొత్తలో ఈ మాటలు అని వుంటే కొంత సందర్భం అయినా ఉండేది. నలభై ఏళ్ళు, నలుగురు పిల్లలూ నెత్తిమీద కొచ్చేక యివేం మాటలు? నిజంగా మీ దగ్గర అంత స్పేర్‌ప్రేమ ఉంటే, అదుగో అలా సెంటరుకెళ్ళి ఎవరికైనా యిచ్చిరండి. మీ మనసు తేలిక అవుతుంది. నాకు తెరిపిగా ఉంటుంది. వగైరా చాలా అనుండేదాన్ని. కాని క్రితంసారి అతని చిన్న బుచ్చుకున్న మొహం జ్ఞాపకం వచ్చి ఒక చిన్న నవ్వుతో ఆ ప్రేమ డైలాగుకి జవాబిచ్చి లోపలికి పోయాను. ఆయన మంచి తనంలో నాకు నమ్మకం ఉంది. అయినా...

ప్రాణానికీ, భయానికీ అవినాభావ సంబంధం ఉంటుందేమో!

ఎలక్కి పిల్లంటే,

కప్పకి పావంటే,

కొందరికి డబ్బంటే,

మరికొందరికి ఆడవాళ్ళంటే (ఆడవాళ్ళక్కూడా)

కేపిటలిస్టులకి కమ్యూనిస్టులంటే,

యిలా ప్రతి ప్రాణికి ఏదో ఒక భయం ఉంటుంది. కాని నాకు మాత్రం అతి మంచివాడు అంటే అపరిమితమైన భయం.

ప్రతి భయం వెనుక ఓ ప్రభల కారణం ఉంటుంది.

నా భయనాక్కారణం బహుశా ఆనందరావే అనుకుంటాను. మావారి శతృవులు నాకు శతృవులు కారు కాని మా వారి ఫ్రెండ్సు నాకూ ఫ్రెండ్సే. ఆనందరావు మా వారి బెస్ట్ ఫ్రెండు.

మా వారు తనువైతే ఆయన మనసు.

అతను జీవాత్మ అయితే, యితను పరమాత్మ.

యితను పెన్నైతే, అతను యింక్.

అతను యింకైతే యితను సీసా.

యితను సీసా అయితే, అతను మూత.

అదే వాళ్ళ సంబంధం.

లోకోభిన్నరుచి అన్నది ఆనందరావు విషయంలో మాత్రం నిజం కాదు. ఆనందరావు అతి మంచివాడు అన్నది సర్వే సర్వత్ర ఆమోదించబడినది.

అయితే మంచివాడుకి నిర్వచనంలో మాత్రం అందరవీ అన్ని అభిప్రాయాలు.

"నిజంగా ఆనందరావున్నాడే ఆహా సాక్షాత్తు ఆ శ్రీరామ చంద్రుడే మళ్ళీ పుట్టేడా అనిపిస్తుంది" యిది కొందరి అభిప్రాయం.

శ్రీరాముడు తండ్రిమాట జవదాటలేదు. ఇప్పుడు మాత్రం ఎవరు దాటేస్తున్నారు? నూటికి తొంభైమంది తల్లి, తండ్రి చెప్పిం చినదే చదివి, తీసుకోమన్నంత కట్నమే తీసుకొని చేసు కోమన్న దాన్నే చేసుకొని, వెళ్ళమన్న దేశమే వెళ్తున్నారు. యింక ప్రజల్ని కన్నబిడ్డల్లా కాపాడేట్ట. అది అతని డ్యూటీ.

రాజు ఉన్నది ప్రజల్ని కాపాడ్డానికే కాని కాల్చుకొని తినడాని క్కాదు. ఎవడు డ్యూటీ వాడు చెయ్యడమే మంచితనమైతే.. యింతకీ ప్రజల్ని ఎలా చూసేడో చెప్పడానికి ఆ ప్రజలిప్పుడు లేరు కాని, తన కన్నబిడ్డలు ఎక్కడ పుట్టేరో (అసలు పుట్టేరో లేదో) పుడితే ఎలా ఉన్నారో, ఏమైపోయారో అతనికి తెలీదు. ఎవడో ఏదో అన్న మాట పట్టుకొని (వాడి మాటే సుప్రీంకోర్టు జడ్జిమెంటులా). కట్టుకున్నదాన్ని, కడుపుతో వున్నదాన్ని, అడ వుల్లో వదిలేసేడు కనీసం నిన్ను వదిలేస్తున్నాను అని చెప్పే ధైర్యమన్నా లేదు. పుట్టింటికి పంపించే మంచితనమూ లేదు.

"ఆనందరావు లేదూ.... మన ఆనందరావు, ఆహా! బుద్ధుడే నండీ. ఏ కోరికా లేదు మానవుడికి, ఏఁవి దయ, ఏఁవి ధర్మ బుద్ధి" యిది మరికొందరి అభిప్రాయం.

ఇతగాడు శ్రీరాముడికి రివర్సు. ఇతను కట్టుకున్న దాన్నీ కడుపున పుట్టినవాడ్నీ వదిలేసి అర్ధరాత్రి పారిపోయేడు. పగలైతే పట్టుకుంటారని.

దేనికిట?

ప్రపంచంలోని దుఃఖానికి కారణం వెతకడానికట! అడవుల్లో కారణాలు దొరుకుతాయని అతని కెవరు చెప్పేరో? దుఃఖానికి కారణం కోరిక! అదీ అతనికి దొరికిన కారణం, ఆ ముక్క చెప్పడానికి అడవికి పారిపోనక్కర్లేదు. పట్టచీర లేదన్న బాధక్కా రణం, ఆ చీర కావాలన్న కోరికే నన్న సంగతి నాలాంటి పీత బుర్రక్కూడా తెలుస్తుంది.

అహింస కూడా బోధించేడట అతగాడు.

అంతకుముందు అందరూ కొట్టుకుచచ్చినట్లు.

మనిషన్న వాడెవడూ కావాలని హింస చెయ్యడు.

ఈ ముక్క చెప్పడానికి అడివికి పారిపోనక్కర్లేదు.

కానీ, ఆనందరావు ఉన్నాడు చూశేరు వాడండీ మనిషంటే.

కొట్టు కొయ్యి, కలలో కూడా అబద్ధం ఆడడు. ప్రాణ, విత్త... అన్న ఎక్సెప్షన్సు కూడా లేవు. హరిశ్చంద్రుడ్ని చంపి పుట్టేడా అని పిస్తుంది. ఆనందరావుకి చాలామంది యిచ్చే సర్టిఫికెట్.

హరిశ్చంద్రుడికి తన సత్యసంధత వల్ల ఏదైనా ఆత్మానందం కలిగిందో లేదో తెలీదు కానీ అతని పెళ్ళాం పిల్లలు స్మశానాలు పట్టేశారు. ఇతని నిజాయితీ ఖరీదు ఒక పెళ్ళాం పిల్లడు. (తన కష్టాలన్నీ కేవలం టెస్టు పేపర్లలాంటివనీ, ఆఖర్కి మంచి రికార్డు ఉంటుందనీ, అతనికి ముందే ఉప్పు అందిందని నా అను మానం. హరిశ్చంద్రుడ్ని కూడా నమ్మలేని నీ పాపానికి నిష్కృతి లేదని మా వారు ఉవాచించినప్పటికీ) అతనితో అన్ని బాధలు పడిన చంద్రమతి మరింత జన్మ జన్మలకీ నిజం చెప్పి ఉండదు.

ఏతా వాతా తేలిందేవంటే "మహా మంచివాడు" అనిపించు కోవాలంటే పెళ్ళాం పిల్లల్ని వదిలేసి తనైనా అడవిలోకి పారి పోవాలి లేదా తనే ఉండిపోయి వాళ్ళనే తగలెయ్యాలి" అదీ సంగతి.

బాధలన్నీ పెళ్ళాలవి.

బిరుదులన్నీ మొగుళ్ళవి.

ఇంతకీ ఆనందరావు విషయం...

## 2

ఆనందరావు ఏ పనైనా సిన్సియరుగానే చేస్తాడు. ఎవరి మెప్పూ ఆశించడు. ఎవరికీ ముప్పు తలపెట్టడు.

పేకాట ఆడడు. పేపరు చదవడు.

రేసులకెళ్ళడు. రేడియో వినడు.

జబ్బుచేసినా "మందు" తీసుకోడు.

పెళ్ళాంముందు కూడా షర్టు విప్పనంత మొహమాటి.

మంచినీళ్ళిచ్చినప్పుడు సహా తల్లిక్కూడా థ్యాంక్సు చెప్పేటంత ఫార్మాలిటీ మనిషి.

ఇంటికొచ్చిన వాళ్ళని వీధి గుమ్మం వరకు దిగబెట్టి వాళ్ళు కారులో కూర్చున్నాక కారు తలుపేసి కారు వెళ్ళేవరకు నిల్చు నేటంత పెద్ద మనషి తరహా.

మరింక కథేవిఁటి?

ఆ వేళతో యస్.యస్.యల్.సి. పరీక్షలు ఆఖరు.

అప్పుడప్పుడు పేపర్లు తిరగేస్తున్న శబ్దం మినహా, పరీక్ష హాలంతా స్మశాన నిశ్శబ్దంగా వుంది.

ఆనందరావుని పరీక్షలెప్పుడూ భయపెట్టలేదు. అంచేత అతను చకచకా రాసేస్తున్నాడు. అతని పక్కనున్న పార్వతీ శానికి మాత్రం పెన్ను కదలటం లేదు.

పార్వతీశానికి ఒక్క పరీక్షలంటేనే కాదు, అకస్మాత్తుగా ఎక్సిడెంటులో చచ్చిపోయిన తన తండ్రి జ్ఞాపకానికొచ్చి నప్పుడు.

బతికున్న తల్లి, తోడబుట్టినవాళ్ళ భవిష్యత్తు తలుచుకున్న ప్పుడు.

ఈ యస్.యస్.యల్.సి. పాసైతేనే తప్ప రాని తన ఉద్యోగం తల్చుకున్నప్పుడు.

ఈ పరీక్ష గట్టెక్కలేక, ఆ ఉద్యోగం రాకపోతే – తను తన తల్లి, తమ్ముళ్ళు అదే స్టేషన్లో ముష్టి అడుక్కోవాలి.

ముష్టి ఇష్టంలేకపోతే ఆ రైలుకిందే వరసగా బుర్రలు పెట్టేయ్యాలి.

ఆఖరి సీను అతని బుర్రలో గిర్రున తిరిగి, భయంతో ఆనంద రావు కాలు గోకించింది.

పార్వతీశానికి కాపీ యివ్వటం మంచిదా చెడ్డదా అన్న సందేహం రాలేదు ఆనందరావుకి.

మనకి తెలీనిది యింకొకర్ని అడగటం అనేది బుద్ధి మంతుల లక్షణం. ఆ అడిగి తెలుసుకోవడం పరీక్ష హాలైనా, పడగ్గదైనా పరవాలేదు.

పరీక్షలు పాసవడం అనేది ఉద్యోగాలకి క్వాలిఫికేషన్సు కాని, నాలెడ్జికి కొలబద్దలు కావు. కాపీలు కొట్టని వాళ్ళంతా బుద్ధి మంతులూ కాదు. కొట్టిన వాళ్ళంతా వెధవలూ కాదు. "ఒక్కో సారి పరీక్ష టైములో ఐన్స్టీన్ అంతటివాడికైనా సరే అడిగినది జ్ఞాపకం రాకపోవచ్చును" అన్న అతని ఫిలా సఫీయే పార్వతీ శానికి కాపీ యిప్పించింది.

అయితే కాపీ యివ్వడానికి యితనికీ, పుచ్చుకోవడానికి పార్వతీశానికి అభ్యంతరం లేనప్పటికీ, అప్పుడే అక్కడికి వచ్చిన వాచరుకి మాత్రం అభ్యంతరం ఉంది.

ఇప్పటి కుర్రవెధవులున్నారే మోస్ట్ ఇర్రెస్పాన్సిబుల్ ఫెలోస్. ఇంటిదగ్గర అమ్మ, నాన్న పస్తులుండి వీళ్ళని చదివిస్తే వీళ్ళు సంవత్సరమంతా సినిమాలు, క్రికెట్ మ్యాచ్లు చూసేసి, పరీక్షల్లో

పక్కవాడి కాళ్ళు పట్టుకుంటారు. పొట్ట కోస్తే పేగులు తప్ప, అరసున్న కూడా కనిపించని వీళ్ళంతా రేపు ఇంజనీర్లు, డాక్టర్లు అయిపోయి, మన ఇళ్ళు, ఒళ్ళు గుల్ల చేసేస్తున్నారు. కాపీ కొట్టిన వాళ్ళని నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తే ఎప్పటికైనా కొందరికైనా బుద్ధొస్తుంది అన్నది ఆ వాచరు (స్టూడెంటు భాషలో వల్చర్) ఫిలాసఫీ.

మరంచేత ఆనందరావు ఫిలసఫీ, వాచరు గారి ఫిలాసఫీ కొట్టుకున్నాయి. ఫలితంగా ఆనందరావు చేతిలో కాయితం, పార్వతీశం చెయ్యి చేరేలోపుల వాచరుగారి చెయ్యి అడ్డొచ్చింది.

చేతికీ, చేతికీ చాలా దూరం.

వాడి కాగితం ఎగిరిపోతే అందిస్తున్నాను అన్నాడు పార్వతీశం ఠక్కున.

ఎవరూ పట్టుకోకబోతే కాగితాలు ఎగరకేంచేస్తాయి? పైగా పైన ఫేనుంది.

వాచరు గారు ఆ కాగితాన్ని తనే భద్రంగా అందించేరు ఆనందరావుకి. పార్వతీశానికి శ్రమలేకుండా అందించడం అయిపోయేక వెనక్కి తిరిగి వెళ్ళిపోబోయేరు.

ఏఁవిఁటి తన కాగితం ఎగిరిపోయిందా? దాన్ని పార్వతీశం అందించబోయేడా? వాచరు సాయం చేశాడా? ఏం? తనేం పూరీ జగన్నాధుడా ఏమిటి, కాళ్ళూ, చేతులూ లేకపోవడానికి? తను చేసినపని వీళ్ళిద్దరూ కాదనడ మేమిటి? ఎగరటం కాదు సార్. నేనే వాడికి కాపీ యిస్తున్నాను అన్నాడు ఆనందరావులోని హరిశ్చంద్రుడు లేచి నిల్చుని.

ఆనందరావు తండ్రి పలుకుబడితో వీళ్ళిద్దరూ డిబార్ కాలేదుకాని యస్.యస్.యల్.సి మాత్రం మరో ఏడాది చదివేరు.

ఆనందరావు నిజాయితీని, ఇటు వాచరూ మెచ్చలేదు. అటు పార్వతీశం క్షమించలేదు.

## 3

పి.యు.సి. అయిపోయేక ఏది చదవాలో నిర్ణయించుకోడానికి అతనికి ఏడాది పట్టింది. అతనికి వచ్చిన మార్కులకి అతనికి అన్ని కోర్సుల్లోనూ సీట్లు వస్తాయి. ఇంజనీరింగు చదవమన్నాడు తండ్రి. ఆనందరావుకి ఇంజనీరింగంటే ఎలర్జీ.

నేను గాంధీ గారి శిష్యుణ్ణి. నేను ఏ పని చేసినా ఎంతోకొంత ప్రజలకి ఉపయోగపడాలి. అదీ నా లక్ష్యం. ప్రజలకి సేవ చెయ్యగలిగితే ఉద్యోగాలు రెండే. ఒకటి ప్లీడరు, రెండు డాక్టరు. ఒక్క అబద్ధం కేసూ చెయ్యకుండా నెగ్గుకు రావడం ఒక్క గాంధీ గారికే చెల్లింది. కాని నాకు చేతకాదు. పార్టీ నిజం చెప్పదు. పోలీసు నిజం చెప్పడు. జడ్జీలు మునసబులు ఏం చేస్తారు మనకి తెలీదు. మరింక నాలాంటి వాడు అబద్ధం చెప్పకుండా నిజాయితీగా ప్రజలకి సేవ చెయ్యాలంటే డాక్టరవడమే మంచిది" అనుకున్న ఆనందరావు మెడిసన్‌లో చేరాడు.

ఎనాటమీ థియేటరంతా చచ్చిన శవాల్తోనూ, బతికున్న స్టూడెంట్లతోనూ బిజీగా ఉంది.

శవాలూ, స్టూడెంట్లూ కూడా గమ్మత్తయిన వాసనేస్తున్నారు.

పరీక్షలు దగ్గరకొచ్చేస్తున్నాయి. మరంచేత దాదాపు అందరూ హాజరయ్యారు.

మనదేశంలో తిండి కొరత ఎక్కువ. ఆకలి చావులూ ఎక్కువే. కాని గమ్మత్తేమిటంటే తిండి కొరతకంటే కూడా ఎక్కువ శవాల కొరత. (తిండిలేని జనం శవాల్ని తినేస్తున్నారా? అన్న విషయం దర్యాప్తు చెయ్యాలి).

ఈ శవాల కొరత కారణంగా ఒక్క శవాన్ని దాదాపు యిరవై మంది పంచుకొని, ఎవరిక్కావలసిన ముక్కలు వాళ్ళు కోసేసుకుంటున్నారు. ఆనందరావు పనివేగం అయిపోయింది. ఏం తోచలేదు. కుడి పక్కచూశాడు.

ఆ టేబులు మీదున్న శరీరానికి నలభై అయిదేళ్ళు బతికి, శవంగా మారి నాలుగురోజులైంది. ఆవిడ వయసులో ఉన్న రోజుల్లో ఆవిడ కంటి చివర చూపు కోసం, ఆవిడ పైటచెంగు కొనకోసం మొగాళ్ళమంద క్యూలో నిల్చునే వారన్న విషయం అక్కడ నిల్చున్న అరడజను అమ్మాయిలకీ తెలీదు.

అందులో యిద్దరమ్మాయిలు అతి సీరియస్‌గా పుస్తకం చదివేస్తున్నారు. మరో అమ్మాయి వాళ్ళని చదవనివ్వకుండా పేజీలు తిప్పేస్తోంది. మరో యిద్దరు అమ్మాయిలు మాత్రం మేజరు ఆపరేషను చేసేటంత సీరియస్‌గా నిల్చున్నారు, చేతుల్తో ఆయుధాల్తో.

నవ్వొచ్చింది ఆనందరావుకి. ఎందుకంత గాభరా? ఒక అరంగుళం అటూ యిటూ అయితే మాత్రం శవానికి నొప్పెడుతుందా? కోపమొస్తుందా? అమ్మాయిలంతా యింతేనేమో. ఇప్పుడు కొంచెం అల్లరి పెడితే ఎలా ఉంటుంది అనుకున్నాడు. ఆనందరావులోని మొగాడు.

అతను కొంచెం కాకుండా ఎక్కువ అల్లరిపెట్టినా కూడా వాళ్ళకసలు తెలీదు. అంత మేజర్ సర్జరీలో వున్నారు వాళ్ళు.

ఆడపిల్లల్ని అల్లరి చెయ్యటం లక్ష రకాలు.

కొంగులాగడాలు, జడ పీకడం, కాలు తొక్కడం పురుగుల్ని విసరటం, పుస్తకాలు దాచేయడం, అన్నీ రౌడీ పనులేకానీ తన లాంటి జెంటిల్మాన్ చేసే అల్లరి ఒక్కటీ కనిపించలేదు. ఆలోచిస్తూ జేబులు తడువుకున్న ఆనందరావుకి జేబులో చిన్న కాగితం ముక్క దొరికింది.

దాన్ని అటూ ఇటూ తిప్పుతున్న చేతులు అలవాటు ప్రకారం రాకెట్ చేశాయి. రాకెట్లు చేతిలో నిలవ్వు. ఎగరాల్సిందే. మరం చేత అది రివ్వున ఎగిరిపోయింది. అసలీ రాకెట్ల ఆట మెడికల్ ఆటకాదు. హైస్కూలు ఆట. హైస్కూల్లో ఆనందరావుకి, అర్జును డని పేరు. అతని గురిలో, అప్పటికీ ఇప్పటికీ మార్పులేదు.

అయితే...

ఆడవాళ్ళని వీకర్ సెక్సు అంటారుట. అది నీరసమో, సున్ని తమో లేక ఫేషనో తెలీదు కాని చదువుకునే అమ్మాయిలెప్పుడూ ఏడు మల్లెపువ్వులెత్తు తూగుతూ ఉంటారు. మరింక చేతిలో వున్న స్కాల్పెల్ యింకో రెండు మల్లెపువ్వులెత్తు ఎక్కువుండడం వల్ల ఆనందరావుకి పక్క టేబులు దగ్గరున్న అమ్మాయి మొయ్య లేక కిందికి వదిలేసింది. ఎప్పుడు? సరిగ్గా ఆనందరావు చేతలో రాకెట్ ఆ అమ్మాయి దగ్గరికి చేరే ఆనందరావు చేతిలో రాకెట్ ఆ అమ్మాయి దగ్గరికి చేరే సమయంలో పురాణాల్లో అయితే అస్త్రాలు వెనక్కి తిరిగి వచ్చేవి కాని, ఈ పేపరు రాకెట్లకి ముందు చూపే కాని వెనుక చూపు లేదు. మరం చేత ఆ రాకెట్ మరి కొంచెం ముందుకు వెళ్ళి అప్పుడు అక్కడికి వచ్చిన ప్రొఫెసరు గారి గుండెల మీద తగిలి పాదాల దగ్గర పడిపోయింది.

ఆ ప్రొఫెసరుగారికి నలభై ఏళ్ళు. యిరవై ఏళ్ళ మీసం, మనుషులంటే జనరల్‌గానూ, మొగాళ్ళంటే స్పెషల్‌గానూ అసహ్యం ఉన్నాయి. ఆ రాకెట్టు తనకే ఉద్దేశింపబడి వుంటే ఏం చేసేదో కాని, కాదని తెలుసు కనుక హు ఈజిట్ అని ఆకలి మీదున్న ఆడపులిలా గర్జించింది.

అలాంటి సందర్భాల్లో తెలివైన వాళ్ళెవరూ నోరువిప్పరు. అప్పుడా ప్రొఫెసరుగారు డిసిప్లిన్‌మీదా, గుడ్ కాండక్టుమీదా ఆయాసం వచ్చేదాకా లెక్చరిచ్చి వెళ్ళిపోతుంది. ఆనందరావు అందరిలాంటి వాడు కాదు అతని గాంధీగారు, గౌతమ బుద్ధుడు, శ్రీరామచంద్రుడు, హరిశ్చంద్రుడు మార్క్స్, లెనిన్ యిలా అందరూ తగుపాళ్ళలోఉన్నారు.

మరంచేత అతనిని గాంధీగారు డిసిప్లిన్ తప్పనివ్వలేదు. ఆ తర్వాత నాలుగోసారి కాని ఆనందరావు ఆ సబ్జక్టు పాస్ కాలేదు. అప్పుడైనా ఆ ప్రొఫెసరు అమెరికా వెళ్ళకపోవడం వల్ల.

# 4

"ఆడది మెచ్చిందే అందం" అన్నారు ఆడవాళ్ళు.

"ఔను" అని ఛేషరతుగా ఒప్పేసుకున్నారు మొగాళ్ళు. (తమని మెచ్చేది ఆడవాళ్ళే కనుక).

మరింక అందానికి వేరే నిర్వచనం అక్కర్లేదు. ఆనంద రావులో ఆడది మెచ్చే అందంతోపాటు, ఆడదాన్ని ఆకర్షించే గుణాలు కూడా వున్నాయి. సువర్చల ఆనంద రావుని ప్రేమిం చింది. ప్రేమైనా పగైనా ఎదుటివాడు గుర్తిస్తేనే రాణిస్తాయి. ఆనందరావు గుర్తింపుకోసం ఆవిడ నాలుగేళ్ళు ఆగింది. నలభై ఏళ్ళాగినా అతనిలోని బుద్ధుడు గుర్తించనివ్వడు. మరింక తనే తెగించాలి అనుకుంది.

సువర్చల తెగింపుకి అవకాశం అనుకున్నకంటే తొందర గానే వచ్చింది. ఆ వేళ యిద్దరికీ పక్క వార్డుల్లో నైట్ డ్యూటీ రూపంలో.

అదృష్టవశాత్తు ఆ వేళ యిద్దరి వార్డుల్లో ఎమర్జెన్సీ లేం లేవు, సర్వ పేషెంట్లూ సుఖనిద్ర పోతున్నారు. స్టాఫ్‌రూంలో సిస్టర్లు కూడా సుఖ నిద్రలోనే వున్నారు. సువర్చలే వచ్చింది ఆనందరావు దగ్గరికి.

వార్డులోటేబులు దగ్గరున్న కుర్చీలో కూర్చున్న ఆనందరావు టేబులు మీదున్న పుస్తకం తిరగేస్తున్నాడు. గతుక్కుమంది సువ ర్చల. అందులోతన ఫోటో ఉంది. చూస్తాడో ఏమిటో? అతను చూడ్డానికే, అతనికివ్వడానికే తను తెచ్చింది కాని యిప్పుడు కాదు. ముందు తన ప్రేమ వ్యక్తం చేసి అప్పుడు... ఆనందరావుకి సమయాసందర్భాలలతో నిమిత్తం లేదు. అతనా పుస్తకం పేజీలు తిప్పుతూ ఒకచోటాగి పరీక్షగా చూశాడు.

ఎవరో అమ్మాయి ఫోటో. బాగానే ఉన్నట్టుంది. ఐనా పరాయి ఆడపిల్లల ఫోటోలో పరీక్షగా చూడడం మర్యాద కాదు. "ఎవరిదో ఫోటో ఉంది ఈ పుస్తకంలో" అని ఆ ఫోటో తీసి జాగ్రత్తగా అందించబోయాడు సువర్చలకి.

అందుకోలేదు సువర్చల.

నాదే. ఎలా ఉంది? అంది తలొంచుకుని.

"ఈ ఫోటో మీదా? నయం, చెప్పేరు? ఎవరండీ ఆ ఫోటో గ్రాఫరు ఎక్కడా పోలికే లేకుండా తీసాడు. మీ అందం అంతా చెడగొట్టేశాడు" అంటాడతను.

పోన్లెండి. మీరు మళ్ళీ తీద్దురుగాని, అంతవరకు ఇదే ఉంచండి. అని తను ఆ ఫోటో అతనికిచ్చేస్తుంది. ఫోటో వెనుక తిప్పిచూస్తే 'విత్ లవ్' అని తను రాసింది చూసి...

ఆనందరావు ఒక్క నిమిషం ఫోటో వేపు చూశాడు.

తరువాత సువర్చల వేపు ఓ అర నిమషం చూశాడు.

మళ్ళీ ఫోటో వేపు.. ఫోటో బాగానే ఉంది.

కాని సువర్చలెందుకు అంత సిగ్గుపడి పోతోంది?

ఏం అమ్మాయిల్రా నాయనా? వీళ్ళ సగం జీవితం సిగ్గుపడ్డం తోనే గడిచిపోతుంది.

"మీరు బైటకంటే ఫోటోలోనే బావున్నారు?" అని తన సిన్సియరు అభిప్రాయం చెప్పేసి ఫోటో యిచ్చేశాడు.

హాస్పటల్లో ఎక్కడో దూరంగా ఒక పేషెంటు బాధగా మూలిగేడు.

చురుక్కుమనబోయింది సువర్చల మనసు.

కాని అతనిలో ఆ అమాయకత్వం చూసే కదా తను యిష్టపడుతోంది. ఏదీ దాచుకోలేని పసిపిల్లాడి స్వభావం, యితన్ని తన ప్రియురాలిగా కాకుండా తన తల్లిగా కాపాడుకోవాలి. అన్న ఆవిడ ప్రేమ చురుక్కుమననివ్వలేదు.

ఈ పూటెలాగైనా తెగించి తేల్చేసుకోవాలి.

సాధారణంగా యిలాంటి విషయాలు చెప్పాలంటే చల్లటి సాయంకాలం.

మొత్తటి సెలయేటి సంగీతం

లేదా పచ్చటి పోలాలు.

ఏవీ లేకపోతే కనీసం డాబామీదో, సినిమాహాల్లోనో చెప్పుకుంటారు.

సినిమాల్లో అయితే "నిన్ను" నైనిటాల్లోను, 'నేను' అన్న మాట ఊటీలోను అని 'ప్రేమిస్తున్నాను' అన్న మాటకి పబ్లిక్ గార్డెన్స్ వచ్చేస్తారు.

తనో...

హాస్పటల్లో చావు బ్రతుకుల మధ్యలో, నవ్వొచ్చింది సువర్చలకి.

"మీ నవ్వుకి కారణం తెలుసుకోవచ్చా?" అన్నాడు ఆనందరావు టేబుమీది ఫ్లవర్‌వేజులో పువ్వులు సర్దుతూ.

యీ సారి నవ్వుకి సిగ్గు కలిపింది, కాని కారణం చెప్పలేదు.

"అంత చెప్పకూడనిదైతే ఒద్దులెండి" నొచ్చుకున్నాడు.

"చెప్తే మీరు నవ్వుతారు"

"నేను నవ్వడం మీ కిష్టం లేదా?"

"మీ నవ్వే కాదు, మీ మంచి, చెడ్డ, కష్టం, సుఖం, అన్నీ నా కిష్టమేఁ" గబుక్కున అనేసింది. అమ్మయ్య ఎంత సులువుగా అయిపోయింది. యీ మాత్రానికేనా యింత భయపడింది!

ఆనందరావు పువ్వులు సర్దటం యింకా అవలేదు.

ఈ అమాయకుడికేం అర్థం అయినట్లు లేదు.

"మనిద్దరం పెళ్ళి చేసుకుంటే ఎలా ఉంటుంది?" అంది రక్కున.

"ఏడిసినట్లుంటుంది"

ఏ ఆడదీ ఆశించకూడని జవాబు.

ఏ ఆడదీ ఎదుర్కోలేని జవాబు.

పువ్వులు సర్దటం అయిపోయిన ఆనందరావు ఎందుకు, ఎలా ఏడిసినట్టుంటుందో వివరించదల్చుకున్నాడు.

"చూడండి (తలవంచుకునే ఉంది సువర్చల). నాకు కొన్ని ప్రిన్సిపల్స్ ఉన్నాయి. నాకో మేనమావ ఉన్నాడు. అతనికో కూతురుంది. అది కడుపులో ఉన్నప్పుడే మా అమ్మా నా పెళ్ళి దానితో నిర్ణయించేసింది. మాటకి కట్టుపడటం నా ధర్మం. మరంచేత నేను ఎవరినీ ప్రేమించలేదు–దల్చు కోలేదు" అన్నాడు.

అంత నిశ్చలంగా మాట్లాడుతున్న మనిషిని ఏమంటుంది? "అయినా మీకు ఆవిడంటే యిష్టవాఁ" అంది.

నవ్వేడు ఆనందరావు.

"ఛఛ యింతవరకు దాని మొహం కూడా సరిగ్గా చూడ లేదు. నాకెవరన్న ఒకటే" తన సర్వమానవ సమా నత్వం తెలియజెప్పేడు.

"మరలాంటప్పుడు మనిద్దరం చేసుకొని తరువాత ఆ అమ్మాయికి మనవేఁ చెయ్యొచ్చు కదా" సలహా యివ్వబోయింది.

ఫక్కున నవ్వేడు ఆనందరావు. తనున్నది వార్డులోనన్న సంగతి మరచిపోయి.

"బావుంది. నీ అన్నం నాకిచ్చీ, నీ ఆకలికి మందిస్తా నన్నాట వెనకటికెవడో అలా ఉంది. మా అమ్మ మాట నిలబెట్టడం నా ధర్మం. నేనెప్పుడూ ధర్మం తప్పను. "లెటజ్ ఫర్ గెట్ దిజ్" అంటూ పుస్తకం తీసుకొని లేచిపోయాడు.

## 5

సాయంత్రం ఏడు దాటింది.

సంక్రాంతి దగ్గరకొస్తోందన్న సంగతి గాలికెలా తెలిసిందో కాని చలి చలిగా వీస్తోంది.

ఆకాశంలో నక్షత్రాలు కూడా చలికి వణుకుతున్నాయా అన్నట్టు మిణుకు మిణుకుమంటున్నాయి.

వెయ్యి చిన్న చేపల్ని మింగిన తిమింగలంలా బరువుగా వెళ్తోంది దూరంగా సముద్రంలో వెళ్తున్న స్టీమరు.

తిమింగలం కడుపులోని చేపల కళ్ళలా మిలమిలా మంటు న్నాయి స్టీమరులో లైట్లు.

డాబామీద చాపలేసుకొని పడుక్కొని కబుర్లు చెప్పుకుంటు న్నాడు ఆనందరావు; మా వారు.

నేను మాత్రం పిట్టగోడమీద కూర్చుని దూరమౌతున్న స్టీమ రుని చూస్తున్నాను.

అదీ సంగతి అన్నాడు ఆనందరావు సువర్చల సంగతి చెప్పి.

పూర్ గర్ల్ మా వారి నిట్టూర్పుకి దూరంగా వున్న స్టీమరొక్క సారి కుదిపింది.

నేనేం అనలేదు. ఆ కథంతా ఏమిటో అయోమయంగా ఉంది. నిజానికి ఇందులో ఆనందరావుని తప్పు పట్టలేను. సువర్చలనీ తప్పు పట్టలేం.

ఆవిడమీద జాలిపడతావు కాని నన్నభినందించవేం? అడిగేడు ఆనందరావు. ఆ అడగడంలో తన మంచితనాన్ని మేము గుర్తించలేదన్న అభియోగం ఉంది.

మంచివాళ్ళకి తన మంచితనంతో పాటు, ఆ మంచితనం ఎదుటివాళ్ళు గుర్తించాలన్న కోరిక కూడా ఉంటుందన్న మాట.

నీ కెందుకూ అభినందనలు? నా కిష్టం లేదు. చేసుకో నన్నావు, అంతే, అన్నా మావారీ మాటకి ఆనందరావు లేచి కూర్చుని హు అన్నాడు. ఆ "హు" అన్న ఆనందరావు నిట్టూర్పుకి ఆకాశంలో నక్షత్రాలన్నీ ఒక్కసారి ఆరి మళ్ళీ వెలిగేయి.

ఒరే అబ్బీ! మనిషిలో మంచితనాన్ని ఎప్పుడు గుర్తించింది ఈ లోకం? నువ్వూ ఈ లోకంలో వాడివే కదా! లేకపోతే నేనే ఏ ప్రిన్సిపల్స్ లేనివాడ్నైతే ఏం చేసేవాడినో తెలుసా? ఆ అమ్మా యికి ఔనని, నాలుగురోజులు తిరిగి, మరెవరూ పెళ్ళి చేసు కోకుండా చేసి, వెళ్ళొస్తాననైనా చెప్పకుండా వెళ్ళిపోయే వాడ్ని....

చెప్పొద్దూ! నాక్కొంచెం షాక్ అనే చెప్పాలి. ఆనందరావు అంటే నాకేం కోపం లేదు సరికదా "అయ్యో యితను ప్రపంచంలో ఎలా నెగ్గుకువస్తాడో అన్న జాలి కూడా ఉంది.

కాని యిదేమిటి? చెడ్డ చెయ్యకపోవడమే మంచి తనవాఁ? నీకు పది రూపాయలివ్వడం కాదు. నీ దగ్గర ఇరవై రూపా యలు పీక్కోకపోవడమే మంచితనం.

పైగా ఈ మంచివాళ్ళనిపించుకోవాలనే వాళ్ళంతా ప్రతిపనీ ముందు చెడ్డవాళ్లు ఎలా చేస్తారో ఊహించుకొని, దాన్ని బట్టి తాము ఎలా ప్రవర్తించాలో నిర్ణయించుకుంటారా? భేష్! ఆనందరావు మాటలకి నాక్కొంచెం చిరాకు కలిగిందనుకుంటాను. "నూటికి తొంభై మంది మీలాగే ప్రవర్తిస్తారు. ఆ పదిమందినీ మనుషులు అనం" అన్నాను.

నా గొంతుకలోని కోపానికి అతను కొంచెం నొచ్చుకున్నట్టు న్నాడు. అతనిలోని మంచివాడి అహం దెబ్బతింది.

"మీకు ప్రిన్సిపల్ ఉన్నవాళ్ళంటే యిష్టం లేనట్టుంది" అన్న అతని మొహంలోని ఎర్రదనం నాకా మసక వెల్తురులో కూడా స్పష్టంగానే కనిపించింది.

"నాకు యిష్టం లేనిది ప్రిన్సిపల్స్ అంటే కాదు. చేసిన ప్రతి పనికీ లేని ప్రిన్సిపల్ అంగట్టడం నచ్చదు" అన్నాను. మామూ లుగా వుండడానికి ప్రయత్నిస్తూ...

నేను ఈ రకంగా వాదించడం మావారికంత యిష్టం ఉండ దని నాకు తెలుసు.

"లెటస్ డ్రాప్ దిస్ టాపిక్ అన్నారు" నేను అనుకున్నట్టు గానే.

అయితే నే నూరుకున్నా ఆనందరావు ఊరుకోడు. "యింతకీ ఆవిడేవంత రంభని వలచేస్తాను. దంతపు పలకల్లా యింతకో పన్ను, పొరపాటునగాని పన్ను దిగిందంటే కాజువాలిటీకి పరు

గెత్తాల్సిందే..." అన్నప్పుడు మాత్రం నేనూరుకో లేకపోయాను. యిహ మా వారు కాదు గదా దేవుడు కూడా నన్నాపలేడు.

"ఆవిడ రంభే అయితే చేసుకునేవారా?" రొక్కించేను.

"మీకు తెలుసు, నాకో మేనరికం అఘోరించిందని".

"ఎలాగా చేసుకోదల్చుకోనప్పుడు ఆవిడని వెక్కిరించడం దేనికి? యాడింగ్ యిన్సల్టు టు యింజూరీ, మీరు కాదనడానికి కారణం ఆవిడ అందం అయినట్టు?" మంచివాళ్ళం దరిలాగే ఆనందరావు కూడా ఓటమి ఒప్పుకోడు.

"ఆవిడకి పళ్లు ఎత్తు అన్న మాట అబద్దం అంటారా?"

"నిజం. నిజం అంటూ ప్రతీదీ చెప్పనవసరం లేదు. నాకు తెలీకడుగుతాను. మీరు ఏదైనా నిజమా అబద్ధమా అని చూస్తారా? మంచీ, చెడ్డా ఆలోచిస్తారా? చెప్పిన ప్రతి నిజం మంచిదై పోతుందంటారా? ఒక దొంగ వెధవ వచ్చి "నేను పరమ దొంగనని చెప్పినంత మాత్రాన ఎంత మంచివాడి విరా" అని మనం దొంగను పొగడక్కర్లేదు ... అంటున్న నన్ను "యింకా ఈ వాదన ఆపుతారా, నన్ను లేచిపొమ్మంటారా" అన్న మా వారి బెదిరింపు మరింక మాట్లాడనివ్వ లేదు.

ఆనందరావు ఆడదైవుంటే మా వారు పెళ్ళిచేసుకునేవారు. అంత అభిమానం ఆయనకి. "వాడికి ప్రపంచ జ్ఞానం లేదు. ఏం చేస్తాం?" అని తరచూ అతని గురించి బాధపడతారు.

"చూడు బ్రదర్ జరిగింది రైటా, తప్పా అన్న మధన తెలివి తక్కువ. ఆ మధన వుండాల్సింది జరగేముందు తరువాత కాదు. ఏది ఏమైనా ఈ విషయం యింకెక్కడా అనకు. యిప్పటికే మీ ఇద్దరికీ కాక మరో యిద్దరిక్కూడా తెలిసింది. పరాయి ఆడపిల్ల గురించి యిలాంటివి పది మందికి తెలియటం మంచిదికాదు" అని సన్నగా హితోప దేశం చేశారు.

మావారే స్వాముల వారు కాదు. ఉపదేశాలు చెయ్యడానికి.

స్పీచిలివ్వడానికి పొలిటీషియనూ కాదు.

హితవులు చెప్పడానికి నీతిచంద్రికా కాదు.

మరి ఆనందరావుకా హితోపదేశం చెయ్యడానిక్కారణం "ఏ మనిషికీ ఏ రకమైన రహస్యాలు ఉండకూడదు. మరొ కరితో చెప్పుకోలేని పని మనం చెయ్యకూడదు. ఒకవేళ మనం ఏదైనా వెధవపని చేసినా, మరొకరు వచ్చి నవ్వొట్టి వెధవిరా అంటే బాధ పడకూడదు. ఎందుకంటే నవ్వెలాగా, వెధవ్వే కాబట్టి..."

యిది ఆనందరావు ఫిలీసఫీలో కొంత మాత్రమే. మరంచేత అతను తను చేసే ప్రతి పనీ, కుంకుంభరిణ చేతిలో లేకపోయినా అందరినీ పిల్చి మరీ చెప్తాడు. ఆ చెప్పటంలో పైవాళ్ళని బైట పెట్టేస్తున్నాని కాని, అలా బైట పెట్టడం మంచిదికాదని కాని అతనికి అర్థం కాదు.

"మనం ఏదైనా పది మందికీ తెలియాలనుకుంటే ఆనంద రావు చెవిని వేస్తే చాలు. తెల్లారేసరికి ఆ ఊరే కాదు జిల్లా మొత్తం తెలిసిపోతుంది.

మరంచేత మా వారు అప్పుడప్పుడూ అతన్ని హెచ్చరిస్తూ ఉంటారు. అతనలా నవ్వేస్తూనే ఉంటాడు.

యిప్పుడు అంతే అయింది. మర్నాటి సాయంకాలానికి ఊరి యావత్తు ప్రజానీకానికీ ఆనందరావు. సువర్చల ఎవరో తెలీని వాళ్ళక్కూడా – "పాపం" ఆనందరావుని సువర్చల పెళ్ళి చేసుకోమని అడిగిందట. అతను "పాపం" వద్దన్నాట్ట అన్న సంగతి డైలాగుల్తో సహా తెలిసిపోయింది.

సువర్చల శతృవులు సంతోషించేరు.

ఆనందరావు శతృవులూ సంతోషించేరు.

నిజానికి ఒక పెళ్ళి కాని అమ్మాయి, మరో పెళ్ళికాని అబ్బా యిని ప్రేమించడం కాని, పెళ్ళి చేసుకోమని అడగడం కాని చెయ్యరాని నేరాలు కాదు. చెప్పుకోవలసిన ఘోరాలు కావు.

కాని ఆనందరావు ధర్మమా అని సువర్చల ఆ ఊరి ప్రజల నోట్లో, ఊరికి చివరికి ఊరువదిలి వెళ్ళిపోయింది. ఆ పరా మర్శలు, విమర్శలు భరించలేక.

ఈ సంగతి విన్నప్పుడు మాత్రం మా వార్ని దులిపేసేను. ఆనందరావుని ఏమీ చెయ్యలేక.

"వాడ్ని ఏవీ అనకు. వాడి హృదయం మంచిది. కాకపోతే తెలివితక్కువవాడు" అన్నారు.

"హృదయం ఎవడిక్కావాలి? చేసే ప్రతి పనికీ, ఆడే ప్రతి మాటకీ హృదయం చీల్చి చూడ్డం, బుద్ధి ఉండొద్దూ!

ఒక ఆడపిల్లని అలా అల్లరిపాలు చెయ్యడమే నా మంచి తనమంటే. ఒక ఆడది అభిమానిస్తే, ఇష్టముంటే ఆదరించాలి. లేకపోతే అమ్మా! నన్ను వదిలీ అని ఒక నమస్కారం పెట్టి వది లెయ్యాలి" అంతేగాని, ఆ అభిమానాన్ని అవమానించిన మగ వాడెవ్వడూ బాగుపడడు. ఒక ఆడదానిగా చెప్తున్నాను. మీ

ఫ్రెండు మంచి స్నేహితుడే కావచ్చు. బ్రహ్మాండమైన డాక్టరు కావచ్చు. ఇంటర్నేషనల్ ప్రైజు తెచ్చుకునేటంత తెలివైన వాడు కావచ్చు. కాని ... కాని... ఒక ఆడదానికి మొగుడుగా "ది వర్స్ట్ హజ్బెండ్" అంతే అన్నాను. ఆవేశంగా.

"శపిస్తున్నావా!" అన్నారు చిరాకుగా.

"కాదు మీ ఫ్రెండు భాషలో నిజం చెప్తున్నాను... ఆ పెళ్ళాడేది ఎవరో కాని ఆత్మహత్య చేసుకుంటుంది" అరిచి నంత పని చేసేను.

## 6

అరుణ పెళ్ళయ్యేక ఆత్మహత్య చేసుకోలేదు.

కాని....

పెళ్ళికి ముందు "నేనతన్ని ఛస్తే చేసుకోను" అని ఆర్రోజులు అన్నం నీళ్ళు మానేసి యుద్ధం చేసింది.

"హవ్వ! నువ్వు కడుపులో ఉన్నప్పటి నుంచి అనుకున్న సంబంధం, యిప్పుడు కాదంటే ఏం బావుంటుంది? కాదనడా నికి కన్ను వంకరా? కాలువంకరా?..." అంటూ నచ్చచెప్ప బోయింది తల్లి.

"నేనేం మన్మధుడు కావాలని ఏడవడం లేదు" యింకా భోరుమంది అరుణ.

"నిక్షేపంలాంటి కుర్రాడు, పైగా డాక్టరు. అన్నిటినీ మించి పరమ మంచివాడు.." తండ్రి బతిమాలేడు.

"అతను డాక్టరు కాదని నేనన్లేదు. చెడ్డవాడనీ అన్లేదు. బాబోయ్ నా బాధ మీ కర్ధంకాదు" అని గోలపెట్టిందే తప్ప అర్ధం అయ్యేటట్టు చెయ్యలేకపోయింది.

పెళ్ళిలో ఆనందరావు చాలా హడావిడి చేశేడు.

మంగళసూత్రధారణ తప్ప మరింక ఏ ఏ పిచ్చిపన్లు పనికి రావన్నాడు. నాగవిల్లి, ఊసరవెల్లి అంటే లేచి వెళ్ళిపోతా నన్నాడు. "ఓ ముద్దు ముచ్చటా లేమేవిఁటమ్మా" అని ముత్తయిదువులు ముక్కులమీద వేళ్ళేసుకున్నారు.

"పట్టు బట్టలు, వెండి కంచాలు వగైరా నహీజాన్తా" అన్నాడు. "ఎంత కష్టసుఖాలు తెలిసిన మనిషి" అని అంతా మెచ్చుకున్నారు పెళ్ళికొచ్చిన పెద్దలు. అయితే వాళ్లివ్వదల్చుకున్న సామానంతా కూతురికే యిచ్చేసేరనీ, అదంతా అరుణ మా దగ్గరే దాచిందనీ ఆనందరావు కీనాటికీ తెలీదు.

పెళ్ళిలో అతనికి సర్దిచెప్పి, చెప్పి మా యిద్దరికీ పది పెళ్ళిళ్ళు చేసినంత నీరసం వచ్చేసింది.

"నేనీ మనిషిని అపార్థం చేసుకోలేదు కదా" అనుకుంది అరుణ.

అయితే అపార్థం చేసకోలేదన్న సంగతి అతి త్వరలోనే నిరూపించేసేడు ఆనందరావు.

పెళ్ళైన కొత్తల్లో....

"ఇద్దరం ఒకరినొకరం అర్ధంచేసుకోవా" అన్నాడు.

"అర్థం ఒక్కటేనా టీకా తాత్పర్యంకూడానా" అన్లేదు అరుణ.

"నాక్కొన్ని సిద్ధాంతాలున్నా" యన్నాడు.

"రాద్ధాంతాలు కానంతవరకు అన్ని సిద్ధాంతాలు మంచివే" అనుకుంది అరుణ.

"ముందు నావి నువ్వు విను" అన్నాడు.

"వింటోంది" అరుణ.

"ఏ ప్లేస్ ఫర్ ఎవిరితింగ్ అండ్ ఎవిరితింగ్ ఇనిట్స్ ప్లేస్"

అన్నది నా మొదటి సిద్ధాంతం. ఏ వస్తువు దాని స్థలంలో లేకపోతే నాకు పిచ్చెక్కిపోతుంది. మాట వరుసకి చదువుతున్న పుస్త కాన్ని మధ్యలో ఆపినప్పుడు దాన్ని మంచం మీదో, కుర్చీలోనే వది లేస్తే నాకు అసహ్యం, తీసుకెళ్ళి మళ్ళీ బీరువాలో పెట్టాల్సిందే.."

ఈ ప్రకారం నేను పుస్తకాలు చదవటం మానేస్తే మంచిది అనుకుంది అరుణ. ఏ కూర వేసుకున్నప్పుడో, కాఫీ తాగు తూనే పుస్తకం చదవటం అలవాటు అరుణకి. కూర కలపడానికి వెళ్ళినప్పుడల్లా పుస్తకం బీరువాలో పెట్టేస్తే, వంటింటికీ బీరువాకీ మధ్య తిరగడంతోనే అయిపోతుంది.

ఆనందరావు సిద్ధాంతాలు ఆగలేదు. "యిల్లెప్పుడూ అద్దంలా ఉండాలి. నీట్‌నెస్ అంటే నాకు పిచ్చి. నేలని జోళ్ళు, చిత్తుకాయి తాలు ఏవైనా సరే చిన్న ముక్క కనిపించినా నాకు ఒళ్ళు తెలీదు. ఏ వస్తువు మీదైనా సరే చిన్న పిసరు దుమ్ము కనిపించినా నేనింక ఆ వస్తువు ముట్టుకోను ...."

ఈ రెండో సిద్ధాంతం ప్రకారం మనకి పిల్లలు పుట్టకపోతేనే బాగుంటుంది అనుకుంది అరుణ.

"అలాగని నా పన్లు నువ్వేంచెయ్యక్కర్లేదు. నా రేజరు కూడా నేనే కడుక్కుంటాను. ఎవరి పని వాళ్ళే చేసుకోవాలన్న గాంధీగారి శిష్యుణ్ణి. అదొక్కటే కాదు. ఈ వేళ పని రేపు చెయ్యకూడదన్న

సిద్ధాంతానికి చిన్న ఎమెండ్‌మెంట్ రేపటి పని కూడా యివేళే చేసెయ్యాలి. అదీ నా మతం ...."

నవ్వొచ్చినా నవ్వలేదు అరుణ. "రేపు రిలీజయ్యే సినీమాకి ఈ వేళే ఎలా వెళతాం? రేపు ఆకలికి ఈ వేళ అన్నం తినగలవా? అని అడిగితే?" అడగలేదు.

"అన్నింటికంటే అతి ముఖ్యమైనది నాకబద్ధం ఆడే వాళ్ళంటే పరమ అసహ్యం. ఎటువంటి సంగతైనా సరే, ఏ పరిస్థితుల్లోనైనా సరే నిజమే చెప్పాలి. నేనెప్పుడూ చెప్తాను. ఎదుటివాళ్ళు చెప్పాలని కోరుకుంటాను. పీకపోయినా సరే అబద్ధం ఆడడానికి వీల్లేదు యింక నీ సంగతేమిటి?" అన్నాడు ఆనందరావు.

"ఎవరేం చెప్పినా 'ఊ' కొట్టడం ఒక్కటే నా సిద్ధాంతం" అనుకుంది. కాని పైకి అన్లేదు. నవ్వేసి ఊరుకుంది.

కాని అలా ఊరుకోనివ్వలేదు ఆనందరావు.

ఆనందరావులో ఒక తమాషా అయిన తత్త్వం ఉంది. సాధారణంగా అందరూ నవ్వి ఊరుకునే విషయాన్ని కూడా అతను లైఫ్ ఎండ్ డెత్ అన్నంత సీరియస్‌గా తీసుకుంటాడు.

మరుపు అనేది మానవ సహజం.

ఆనందరావు మెంటాలిటీ ఎంత తెలిసినప్పటికీ ఎప్పుడైనా అరుణ తాగిన కప్పు కడగడం మరిచిపోవడమో, టేబులు దులపడం మరిచపోవడమో జరుగుతూనే ఉంది.

"మరిచిపోవడం అనేది నేను జవాబుగా తీసుకోను. మరుపు అనేది ఎప్పుడొస్తుంది? ఎదుటివారి మీద లక్ష్యం లేనప్పుడు ఎదుటివాడి మాటమీద గురిలేనప్పుడు, ఎదుటివాడి ప్రిన్సిపల్స్‌ని గౌరవించడం నేర్చుకో...' అన్న లెక్చరివ్వటం జరుగుతూనే ఉంది.

ప్రతి చిన్న విషయానికీ ప్రిన్సిపల్స్ ఎప్లై చేసి ఎందుకంత రాద్ధాంతం చేస్తాడో అర్థం కాలేదు అరుణకి. మాటవరసకి.

పెళ్ళైన కొత్తలో...

"ఈ చీర ఎలా ఉంది?" అడక్కూడదనుకుంటూనే అడిగింది అరుణ కొత్త చీర కుచ్చెళ్ళు సర్దుకుంటూ.

"చీరకేం? బ్రహ్మాండంగా ఉంది. నీకు యింకా బ్రహ్మాండంగా ఉంది" అంటాడు సుఖమయి సంసారం కావాలనుకున్న మొగుడు.

"యు లుక్ బ్యూటిఫుల్ ఇన్ అండ్ అవుటాఫ్ శారీ" అంటాడు మోహర్బానీ మొగుడు.

"విడివిడిగా చీరా బావుంది. నువ్వూ బాగున్నావు. కాని, చీరా, నువ్వు కలిసి బావుండాలంటే నువ్వు యింకొంచెం పొడవైనా ఉండాలి. లేకపోతే చీర అంచు యింకొంచెం పొట్టయినా ఉండాలి అంటాడు" లౌక్యం తెలిసిన మొగుడు.

ఆనందరావు యివేవీ కాదు. అంచేత "కరెక్టుగా చెప్పాలంటే అమ్మవారి పండుగనాడు పూనకం వస్తుందే, అచ్చు ఆ మనిషిలా ఉన్నావు" అన్నాడు పకపక నవ్వుతూ.

అతని సంగతి తెలిసినా అరుణలోని ఆడమనసు బాధగా మూలిగింది.

"చూడు నా సంగతి నీకు తెలుసు. నేనే చిన్న విషయానికీ అబద్ధం ఆడను. మరంచేత నా అభిప్రాయాలెప్పుడూ అడక్కు. అడిగితే అయ్యో అలా అన్నాడే" అని బాధపడకు అన్నాడు.

ఎంత అర్థం చేసుకుందామనుకున్నా అర్థం కావడం లేదు ఈ మనిషి. ఏమిటితని తత్త్వం? "చీరెలా ఉందోన" ని మొగుడ్ని అడగడం ఘోరాపరాధమా? హత్యానేరమా? యింత చిన్న విషయాలక్కూడా సత్యాసత్య మీమాంస ఉండాలా?

భగవాన్! యిలాంటి మనిషితోనా నేను బతికున్నంత కాలం సంసారం చెయ్యాలన్న భయం మొట్ట మొదటి సారిగా అప్పుడే కలిగింది.

"ఇంట గెలిచి రచ్చగెలవమని" నానుడి.

కొందరు యిక్కడా అక్కడా కూడా గెలుస్తారు.

వాళ్ళనే అదృష్టవంతులంటారు.

రెండింటా ఓడిపోయిన వాళ్ళని చేతకాని వాళ్లంటారు.

నేను ప్రైవేటు ప్రాక్టీసు పెడదావనుకుంటున్నాను" ఆనందరావు ఎనౌన్స్ చేశాడు ఓ నాడు.

"శుభం" దీవించేరు మా వారు.

నాకెందుకో అతను ప్రాక్టీసు పెట్టడం నచ్చలేదు. ఆనందరావుని అందరికంటే బాగా అర్థం చేసుకున్నది నేనే నేమో అన్న అహంకారం నాకు అప్పుడప్పుడు కలుగుతుంది.

"ఎందుకు లెస్తురూ? సర్వీస్‌లో చేరిపోక" అన్నానే కాని నా మాట వింటాడన్న నమ్మకం మాత్రం లేదు.

నిజానికతను ఎవ్వరిమాట వినడు.

"సర్వీసులో చేరే బదులు సన్యసించటం మంచింది. ఒకడి

చేతికింద నేను ఛస్తే పనిచెయ్యను. పైగా మంచాన్ని అమ్ము కోవటం, మందులమ్ముకోవడం ఛీ! ఛీ! అట్లాంటి వెధవ పన్లు నాకు చేతకావు సరికదా మరోడు చేసినా నేను సహించను. యింతకీ ప్రజలకి రియల్ సర్వీసు చేయదల్చుకుంటే ప్రైవేటు ప్రాక్టీసంత ఉత్తమం మరోటి లేదు. యింక డబ్బంటావా? డబ్బు లక్ష్యం నాకెప్పుడూ లేదు. ఉన్నవాడిస్తాడు లేనివాడు లేదు – ఏవంటావ్" అన్నాడు మా వారితో.

ఎవరు మాత్రం ఏవంటారు? ఎటొచ్చీ అతనెంతవరకు సాగ గలడు అన్నదే మా భయం. అతని ప్రిన్సిపల్స్ ఎంత వరకు ఉపయోగపడతాయి?అన్న మా భయాలకి సమా ధానం తొందరగానే దొరికింది.

హాస్పిటల్ ఓపెనింగు అట్టహాసంగానే జరిగింది.

నీ హాస్పిటల్ ఎప్పుడూ పెషెంట్లతో పెళ్ళివారిల్లులా కలకల లాడుతూ ఉండాలని దీవించేరు పెద్దలు.

"మా సహాయ సహకారాలెప్పుడూ ఉంటాయని హామీ యిచ్చారు" తోటి డాక్టర్లు.

పళ్ళూ ప్రిస్కిప్షను పేడ్స్ పట్టుకొచ్చి మమ్మల్ని కంటకని పెట్టమన్నారు మందుల షాపువాళ్ళూ, ఎక్స్‌రేల వాళ్ళూ.

ఇంతవరకూ బాగానే జరిగింది.

బోర్డు పెట్టిన ప్రతివాడు బిల్డింగులు కట్టలేదు. కాని ఆనంద రావు తను ఉంటున్న యింటికి అద్దె కూడా కట్టలేక పోయాడు.

కారణం ఫలానా అని చెప్పలేం.

అతనికి వైద్యం తెలీదా అంటే సబ్జక్టు విషయంలో అతను టెస్ట్‌బుక్ లాంటి వాడు.

దయాదాక్షిణ్యం లేదా?

ఆ మాట అతని ప్రబల శతృవుకూడా అనలేడు. అసలతని దగ్గరకొచ్చే పేషెంట్లు మందు కొనుక్కోగలరా లేరా అన్న ఆలోచనే అతనికెప్పుడూ రాదు. వచ్చిన ప్రతివాడికీ తన దగ్గరున్నంతవరకు మందులో, టానిక్కులో యిచ్చేస్తాడు. తన దగ్గరక లేకపోతే మందుల షాపులో అరువు తెప్పించి యిస్తాడు. ఎకౌంట్ తన పేర రాయించుకొని.

"లేనివాళ్ళకి నీ దగ్గరున్నవి తప్పకుండా ఇయ్యి. ఎవరూ ఒద్దనరు కాని డబ్బున్న వాళ్ళకీ, ఆఫీసర్లకీ అందరికీ ఎందు కిస్తావు? ప్రిస్కిప్షను రాసియిస్తే కొనుక్కుంటారు కదా? నీ కెందుకీ తద్దినం?" అని మా వారోసారి చెపితే.

"ఛ! ఛ! ఎంత తప్పు! (యిక్కడ ముక్కు ముక్కుమీద వేలు వేసుకుంటాడు) వాళ్ళేదో నా మీద గౌరవం కొద్దీ, నమ్మకం కొద్దీ పెద్దమనిషి తరహాగా వస్తే, ముష్టి మందులివ్వడానికి ఏడిస్తే ఏం బావుంటుంది? నాపాటి డాక్టరు ఊర్లో లేక వస్తారంటావా ఏదో ఆ గౌరవం నేను దక్కించుకోవాలి కాని..." అని మనమేదో తెలివితక్కువగా చెప్పినట్లు నవ్వే స్తాడే తప్ప చాలామంది పెద్ద మనుషులు ఆ మందుల కోసమే తప్ప తనమీద గౌరవడంతో రారన్న అతి చిన్న విషయం అతనికి అర్థం కాదు అంతే!

పోనీ మందులు ఉచితంగా పుచ్చుకుంటారు కనీసం పీజైనా అడుగు అంటే "ఎంత నీచం 'దేహీ' అని అడుక్కోమంటావా? ఎవడికి బుద్ధి ఉంటే వాడే యిస్తాడు. లేదూ వాడి పాపం వాడిదే ఊరికే జబ్బు బాగు చేసిన పుణ్యమైనా దక్కుతుంది" అంటాడు.

మరంచేత కొందరు జబ్బు కుదిరేక డజను అరిటిపండ్లో అరడజను యాపిల్ పళ్ళో టేబిలు మీద పెట్టి "థ్యాంక్యూ డాక్టర్" అని ఓ షేక్‌హేండిచ్చి వెళ్ళిపోతారు. ఆ పళ్ళు కూడా అనవసరం అనుకున్న మరికొంతమంది ఓ సిగరెట్టు ఆఫర్ చేసి, ఈతను సిగరెట్లు కాల్చనందుకు సారీ చెప్పి షేక్‌హేండిచ్చి వెళ్ళిపోతారు.

మందులు రాసిచ్చే అలవాటే లేదు కాబట్టి అతనికి మందుల షాపుల్లో ఎకౌంటే తప్ప వాళ్ళతో పెర్సంటేజి ప్రశ్నలేదు.

ముల్లు గుచ్చుకున్నా మూడ్రోజులు ఎడ్మిట్ చేసుకునే కక్కుర్తి అసలే లేదు.

ఎక్సరే వాడితో లాలూచీపడి, అవసరం ఉన్నా, లేక పోయినా ఎక్సరేలు తీయించి, పేషెంటుని మాపే నీచానికీ అతనికి చాలా దూరం.

మొత్తానికేది ఏమైనా ఆనందరావు యింకో అర్నెల్లు గనక ప్రాక్టీసు కొనసాగిస్తే యింట్లో వున్న సామాను అమ్ముకు తినాలన్న విషయం మాత్రం నాకర్థం అయింది.

ఆనందరావుని నయానో, భయానో ఒప్పించగలిగేది మా వారొక్కరే ఇంతవరకు నువ్వు చేసిన ప్రజాసేవ చాలు అని నచ్చచెప్పి ఆనందరావు చేత బోర్డు మూయించేసారు.

"సర్వీసులో చేరాలంటే ఒకటే పలుకుబడైనా ఉండాలి. డబ్బైనా ఖర్చు పెట్టాలి. నాకు రెండూ లేవు. ఒకవేళ ఉన్నా

నాకు యిష్టం లేదు" అని కూర్చున్న ఆనందరావు చేత దగ్గరుండి అప్లికేషను పెట్టించి, తనే స్వయంగా పోస్టు చేసేరు మా వారు.

అయితే పలుకుబడి ప్లస్ డబ్బు ఖర్చుపెట్టింది ఆనందరావు మాఁవ. కేవలం తన ప్రతిభవల్లే ఉద్యోగం వచ్చిందని ఆనంద రావు నమ్మకాన్ని మేమెవ్వరం పాడు చెయ్యదల్చు కోలేదు.

## 7

పెళ్ళి కాకముందు అరుణకీ,

తరువాత అరుణకీ పోలిక పేరొక్కటే.

అప్పటి అరుణ.

పారుతున్న పిల్ల ఏరు.

నవ్వుతున్న వెన్నెల.

ఆకాశంలోంచి పారే జలపాతం.

గులాబీ గుత్తి.

ఇప్పుడో

ఎండిపోయిన ఏరు,

తుఫానులో ఆకాశం,

మాడిపోయిన మల్లెపువ్వు,

అరుణని చూసిన వాళ్లెవరికైనా ఆవిడ అప్పుడే అయిన వాళ్ళందర్నీ పోగొట్టుకున్నంత పరమదీనంగా కనిపిస్తుంది.

కళ్ళలో ఎప్పుడూ ఏదో భయం.

మాటల్లో ఎప్పుడూ తటబాటు.

ఆనందరావు ఈవిడ్ని కాల్చుకుతినడం లేదు కదా! ఛాదస్తపు మొగుడు చెబితే విడనడు, చెప్పేదాకా ఒగ్గడని కన్నతల్లితో కూడా నోరు విప్పనంత గుంభన అరుణది.

ఆ వేళంతా సినిమా ప్రోగ్రాం వేసుకున్నాం. నేనూ, మా వారు వెళ్ళేసరికి ఆనందరావు రెడీగానే ఉన్నాడు. అరుణ యింకా ఏదో సర్దుతూనే ఉంది.

"ఎందుకలా ఎప్పుడూ ఏదో పనిచేస్తూనే ఉంటావు?" అన్నాను.

అంత సులువుగా తొణుకుతుందా?

"ఊరికే కూర్చుంటే ఏం తోస్తుంది?" అంది అతి మెల్లిగా.

"బావుంది ఏ పనీ లేనప్పుడు ఏం చేస్తాం?"

"బద్ధకం సగం దరిద్రంట" అంది.

"మిగతా సగం దరిద్రం ఏవిటి?" విసుక్కున్నాను.

"మీ కర్థం కాదు" అంది ఎపోలజెట్టిగా నవ్వుతూ.

ఎందుకర్థం కాదు? బాగానే అర్థం ఔతుంది. ఆనందరావు గురించి ఈవిడ నాకు చెప్పాలా? అందులోనూ అరుణ నాలా నోరుగలది కూడా కాదు. మనం పది మాట్లాడితే ఒకటి మాట్లా డుతుంది.

"పండుగకి పుట్టింటికి వెళ్తావా? ఇక్కడే ఉంటావా?" అన్నాను. పుట్టింటి పేరెత్తితేనైనా హుషారుగా ఉంటుందే మోనని.

"చిన్న పిల్లనా ఏవిటి?" నవ్వింది నీరసంగా.

"వాళ్ళ అబ్బ పిలిస్తే కదా? అంత మర్యాదే ఈ మానవుడికి వుంటే ఈవిడ్ని పట్టగలమా?" అందుకున్నారు ఆనందరావు.

"అల్లుడు కాబట్టి మీకు ఆహ్వానం కావాలేమో కాని, ఎవరి అమ్మ, నాన్న దగ్గరికి వాళ్ళు వెళ్ళటానికి బొట్టు పెట్టి పిలవాలా?" సమర్థించబోయేను.

"బొట్టుపెట్టి పిలవక్కర్లేదు కాని ఓ కార్డుముక్క చాలు"

"ఇంతకీ నీకు పోష్టింగు ఎక్కడొస్తుందనుకుంటున్నావురా" అని మాట తప్పించబోయేరు మా వారు.

ఆనందరావు మాట తప్పుడు. ఒకర్ని తప్పించనివడు.

"ఎక్కడోవేస్తారులెద్దూ" అని మా వారికి జవాబు చెప్పి "నా యిల్లే అయినా నేనెప్పుడూ మంచినీళ్ళు కూడా దేహీ అని అడగను. ఏం అరుణా! ఎప్పుడైనా అడిగేనా... అన్నమైనా పెడితే తింటాను, లేకపోతే లేదు. అది నా మెంటాలిటీ..." అంటున్న ఆనందరావుని ఏం అనాలో నాకర్థం కాలేదు.

ఏఁవిటీ మనిషి? అమాయకత్వమా? అహంకారవాఁ?

కట్టుకున్న పెళ్ళాన్ని అన్నం పెట్టమనడం అడుక్కోవడమా?

అరుణ ఎప్పుడూ అలా టెన్షన్లో ఉండడానిక్కారణం అప్పుడు తెలిసింది నాకు.

అరుణలో మాత్రం పైకి ఏ ఫీలింగ్సు లేవు.

"సినిమాకీ టైమైపోయినట్టుంది" అంటూ లేచేను అంత సులువుగా లేస్తే ఆనందరావే కాదు.

"మరేం ఫరావాలేదు. మహా మిస్ అయితే న్యూస్ రీల్

మిస్ అవుతాం. అంతకంటే రసవత్తరమైన మా మామ కథ చెప్తాను కూర్చోండి. ఈలోగా మరోసారి కాఫీ తాగండి" అని అరుణవేపు తిరిగి ఏం పిల్లా మీ బాబు సంగతి చెప్పనా? అన్నాడు పెర్మిషను కోసం అన్నట్టు.

మాట్లాడలేదు అరుణ.

"మాకు తెలీని మనిషి గురించి చెప్పినట్లు చెప్తావేం? అతను నాకు బాగా తెలుసు. నువ్వేం చెప్పనక్కర్లేదు"

కాని ఆనందరావు తను చెప్పదల్చుకున్నది చెప్పందే కదలడు. అతన్ని ఆపటం ఎవ్వరితరం కాదు.

"నీకు తెలిసింది మీలియను వంతు. ఇహిహి అని నీ ముందు చేతులు కట్టుకొని నిల్చుంటే మొత్తనివాడనుకున్నా వేమో. అలా చేతులు కట్టుకొని నిల్చునే పీకలు మార్చేస్తాడు. ఒఠి లుచ్ఛా. కావాలంటే స్వంత కూతురుంది అడుగు. అఫ్‌కోర్సు. ఆవిడికి కొంచెం బాధగానే ఉంటుందనుకో. కాని ఏం చేస్తాం. నిజం ఎంత భయకంరగావున్నా భరించక తప్పదు."

నిజం మాట అతనెరుగను కాని, నాకు మాత్రం ఆ పరిస్థితి భయంకరంగానే ఉంది.

అరుణ తండ్రి ఎలాంటివాడైతే మాకెందుకు? ఆ మాట కొస్తే ఆనందరావు తండ్రి మాత్రం ఏమంత మంచివాడు? భూతద్దం పెట్టి వెతికితే ప్రతి మనిషిలోను అంతో యింతో చెడ్డ ఉంటుంది. మన కిష్టమైన వాళ్ళయితే క్షమిస్తాం. యిష్టంలేని వాడైతే తిడతాం. ఎంత ప్రాణ స్నేహితులమైన నప్పటికీ, ఆవిడ తండ్రి నిజంగానే ఒకవేళ చెడ్డవాడైనా మా ముందు అతన్నలా తిట్టడం ఆనందరావు నిజాయితీకి నిదర్శనం ఔనో కాదో కాని అరుణ పట్ల మాత్రం అన్యాయం ఔతుంది. అరుణే గనుక "నీ బాబు మాత్రం తక్కువవాడా?" అని వుంటే? కాని అరుణ నోరెత్తదన్న భరోసా అతనికుంది.

అతనికే గనుక నాలాంటిది దొరికుంటే?

ఏవుంది? రోజూ రామ రావణయుద్ధం అయుండేది.

అరుణ కంట్లో తడిపొర స్పష్టంగా కనిపిస్తోంది.

అయినా ఆనందరావు ఆగలేదు. "నేనెందుకు అతని దగ్గర అర్ధరూపాయి కూడా పుచ్చుకోనో తెలుసా. పరమ పాపిష్టి డబ్బు"

"అది న్యాయార్జితం అయితే పుచ్చుకునేవారా?" అన్నాను ఒళ్ళుమండి.

ఏమిటీ వెర్రి ప్రశ్న అన్నట్టు నవ్వి "కాదు కాబట్టి ఆ ప్రశ్నే లేదు. ఒక్కసారి ఒద్దు మొర్రో అన్నా, వినకుండా ఒక ఉంగరం యిచ్చేడు. ఎంత ఏడుస్తూ పెట్టేడో గాని అర్నెల్లు తిరక్కుండానే పోయింది. యామ్ ఐ రాంగ్" మళ్ళీ అడిగేడు అరుణని. వెర్రి నవ్వే ఆవిడ సమాధానం.

ఆ బాబుకి కూతురే ఈవిడ. బుర్రబద్దలు కొట్టుకో, సమాధానం చెప్పదు. జీన్స్ ఎక్కడికి పోతాయి?

ఆనందరావంటే ఏంతో అభిమానం ఉన్న మావారిక్కూడా దుర్భరం అనిపించింది. "ఒరే పిచ్చిపిచ్చిగా మాట్లాడకు. పెళ్ళికి ముందు నీకివన్నీ తెలీవా? అప్పుడేమైంది నీ బుద్ధి? యింతకీ అతనె లాంటి వాడైతేనీకేం. నువ్వు పెళ్ళిచేసుకొన్నది అతన్ని కాదు"

అరుణ యిప్పుడే వస్తానని లోపలికి వెళ్ళిపోయింది. కన్నీళ్ళు ఆపుకోనడానికని మాకందరికీ తెలుసు.

"... హేవ్ సమ్ డిసెన్సీ. మా ముందు అలా అనడం ఏం బావులేదు. కొంచెం మర్యాద నేర్చుకో" అని చీవాట్లు పెట్టేరు.

"ఛ! ఛ! నాకు ఆవిడ్ని బాధ పెట్టడం యిష్టం అనుకుంటు న్నావా? నాకావిడంటే ఇష్టం లేదా ఏమిటి? ఎటొచ్చీ మా నాన్న మహాత్ముడు అనుకుంటోంది. ఆవిడ కళ్ళు తెరిపించటం నా ధర్మం. "మా బాబు లుచ్ఛా" అని ఆవిడ ఒప్పుకున్ననాడు మళ్ళీ నేను ఆ పేరెత్తితే ఒట్టు... సినిమాకి టైమైనట్టుంది. పోదాం పదండి" అంతవరకు ఏదో సినిమా కథ చెప్పినంత యీజీగా అంటున్న ఆనందరావుకి నేను సగమే అర్థం చేసుకోగలిగేనేమో అనిపించింది.

## 8

అనగనగా ఒక ఊరు.

ఆ ఊరుకొక పంచాయితీ.

ఆ పంచాయితీ కొక ప్రెసిడెంటు.

ఆ ప్రెసిడెంటు కొక పాలేరు.

ఆ ప్రెసిడెంటుకీ, పాలేరుకీ ఒక జాయింటు ముండ.

ఇందులో ఏ ఒక్క దానికీ ఆనందరావుకీ అభ్యంతరం లేదు. నిజానికి ఆనందరావు ఆ ఊరి గవర్నమెంటు డాక్టరుగా వచ్చిన తరువాత బీద, బిక్కీ అంతా "దేవుడిలాంటి డాక్టర"ని చేతులెత్తి దణ్ణం పెట్టేరు.

"గడ్డివామి దగ్గర కుక్కలా" తను తినడు. ఎదుటివాడ్ని తిననివ్వడని హాస్పిటల్ స్టాఫ్ తిట్టుకున్నారు.

'డబ్బుకి లొంగనివాడ్ని యింతవరకు మేము చూడలేదు చూద్దాం" అనుకున్నారు ఊరి పెద్ద మనుషులు.

అయితే ఆ చూసే అవకాశం అంత వేగం వస్తుందని వాల్లూ అనుకోవడం లేదు. ఆ అవకాశం ఎలా వచ్చిందంటే...

ప్రెసిడెంటుగారి, పాలేరు గారి జాయింటు ప్రియురాల్ని ఎదుటి పార్టీ వాళ్ళు ఎత్తుకుపోయేరు. ఎత్తుకుపోయిన వాళ్ళేం చేశారో తెలీదు కాని రెండ్రోజులు పోయేక మాత్రం "పోవే ముండా" అన్చెప్పి మళ్ళీ ప్రెసిడెంటు గారి దగ్గరికి పంపించేశారు.

రావఁణుడు ఎత్తుకుపోయిన సీతకి రాముడు అగ్ని పరీక్ష పెట్టేడు.

ప్రతిపక్షాలు ఎత్తుకుపోయిన ప్రియురాలిని ప్రెసిడెంటు గారు డాక్టరు పరీక్ష పెట్టేరు.

అలనాటి అగ్నిదేవుడు సీతని పునీత అన్నాడు.

ఈనాటి ఆనందరావు అంత మాట అనలేదు కాని ప్రెసిడెంటుగారిక్కావల్సిన మాట కూడా అనలేదు.

"రేప్‌కేసు" అన్నారు ప్రెసిడెంటు మనుషులు.

"మెడికల్ సర్టిఫికెట్ తెమ్మన్నారు" పోలీసులు.

"ఇమ్మన్నారు" ఆనందరావుని ప్రెసిడెంటు మనుషులు.

రేటెంతో కూడా కనుక్కురమ్మన్నారు ప్రెసిడెంటు గారు.

"రేపూ లేదు, రేటూ లేదు. పంచాయితీ ప్రెసిడెంటు కాదు అమెరికా ప్రెసిడెంటు వచ్చి అడిగినా దొంగ సర్టిఫికెట్టు యివ్వను" పొమ్మన్నాడు ఆనందరావు.

మరైతే సామాను సర్దుకోమన్నారు ప్రెసిడెంటుగారు,

"సర్దుకోవడానికి నాకేం సామాను లేదు. 'సిరికిం చెప్పదు ..' లాగ స్టెత్ చేత్తో పట్టుకొని వెళ్ళిపోవటమే" అన్నాడు ఆనందరావు.

వీళ్ళ వాగ్వాదం యిలా జరుగుతూ ఉండగా...

పోలీసులకేం తోచలేదు.

"రేప్ కేసంటారు" వీళ్ళు.

"కాదంటారు" వాళ్ళు.

"సర్టిఫికెట్ యివ్వనంటా"డా కుర్ర డాక్టరు.

"నిజానికి అదేం పెద్ద పతివ్రత కనకా "అయ్యో" అనుకోవడానికి కాకపోతే, ఇప్పుడు బాగా డబ్బు దులపగల ఛాన్సు. మరంచేత"

"ఇలాంటి దొంగ ఎదవ కేసులెట్టి పరువుగల ఆడదాన్ని బజారుపాలు సేద్దారనుకున్నారేమో! ఇదుట్టి అబద్ధం అని ఆ గుంట డాక్టరుగాని ఒక్క కాయితం ముక్క యిచ్చే ఉంటే మరింక మీ అందర్నీ మూసెయ్యాల. ఏటంటారు?" అన్నారు ప్రెసిడెంటు మనుషుల దగ్గరికి వెళ్ళి.

"బాబ్బాబు, దాని మానానికి భంగం అయిందాలేదా అన్న అంశం ప్రెసిడెంటుగారు, వారి పాలేరు నిర్ణయించు కుంటారు. మమ్మల్ని వదిలీ" అని వాళ్ళు పోలీసుల జోళ్ళు, జేబులు పట్టు కున్నారు.

ఆ తరువాత ప్రతిపక్షాల దగ్గరికెళ్ళి దొంగ వెధవల్లారా ఒక ఆడదాన్ని అన్యాయం చేసి ఊరేగుదాం అనుకుం టున్నారా?

"ఈ వేళ ఇది అయింది. రేపు మరొకర్తె ఔతుంది. ప్రెసిడెంటు ఊరుకున్నా మేము ఊరుకోం. అసలు మేము ఉన్నది దేనికి? ఏటంటారు?" అన్నారు.

"బాబ్బాబు, మా బుద్ధి గడ్డితింది. ఎవరో ఏదో ఎత్తుకెళ్ళమంటే ఎత్తుకెళ్లేం కాని ఆ మాత్రం రంభ మాకు దొరకదనా?" మమ్మల్ని ఒదిలీమని వాళ్ళూ జోళ్ళూ, జేబులూ పట్టుకున్నారు.

మొత్తానికెలాగైతేనేం పోలీసుల పుణ్యం వల్ల నయం. అదసలే వెర్రిముండ. ఆ వెర్రిదాని మాటలు నమ్మి కోర్టుకి ఎక్కలేదు. అని గాఠిగా లెంపలేసుకొని పెట్టిన పిటీషను ఉపసంహరించుకున్నారు ప్రెసిడెంటుగారు.

మరింక ఆనందరావు సామాను ఉన్నా, లేకపోయినా సర్దుకోవలసిన అవసరం లేకపోయింది.

"ఛీ! ఛీ! యిలాంటి దర్టీ పోలిటిక్స్ ఉన్న ఉళ్ళో నేను ఛస్తే ఉండను" అనుకున్నాడు ఆనందరావు. పదిమంది ఉన్నచోట పొలిటిక్స్ ఉంటాయనీ, పొలిటిక్స్, పొలిటిక్స్ ఉండాలే గాని అవి దర్టీగానే తప్ప మరోలా ఉండవని తెలీక.

"తథాస్తు" అన్నారు అక్కడి డి.యం.ఓ. గారు యినస్పెక్షనుకి వచ్చి.

ఆ డి.యం.ఓ. గారు వారి సతీమణిని విడిచి అరక్షణం కూడా ఉండలేరుట. అంచేత ఆయన ఒక్క బాత్రూము మినహా

యించి తను ఎక్కడికి వెళితే అక్కడికి తీసుకెళ్తారు అవిడ్ని. మరంచేత ఆయన ఆనందరావు హాస్పిటల్ యినస్పెక్షనుక్కూడా "తన వెంట సిరి..." అన్న విష్ణు మూర్తిలా భార్యాసమేతంగా మందీ మార్బలం వెంట రాగా వేంచేశారు.

అందరి ఆఫీసర్లలాగే అయినా ఆ ఊరి గెస్ట్‌హౌస్‌లో విడిది చేసి ఆనందరావుకి కబురు చేసేరు రమ్మని – "యినస్పెక్షను హాస్పిటల్‌కి, గెస్ట్‌హౌస్‌కి కాదు" అన్నాడు ఆనందరావు గెస్ట్‌హౌస్‌కి మాత్రం వెళ్ళలేదు.

ఆ డి.యం.ఓ. గారింకొక ఏడాదిలో రిటైరైపోతారు. సర్వీసులో ఉండగానే సేవింగ్సు ఎకౌంటు పెంచాలి అన్నది అతని మోటో.

ఆయన ఆనందరావు లాంటి "బచ్చాల్ని" బండెడు మందిని చూశాడు. కొత్తకదూ. అంచేత "నీతిచంద్రిక" వల్లిస్తున్నాడు. అనుకున్నవారై మొదటి తప్పుగా ఆనందరావుని క్షమింప చేశారు. "ధర్మ ప్రభువు" అనుకున్నాడు అక్కడి స్టాపంతా.

మర్నాడు పొద్దున్నే మళ్ళీ కబురొచ్చింది. అర్జంటుగా "పెద్ద సైజు టూత్ పేస్టు" కావాలని. ఆనందరావు ప్రిన్సిపల్స్‌కి మర్యాద ఎప్పుడూ అడ్డురాదు. "పాపం ప్రయాణం హడా విడిలో మరిచి పోయి వుంటారను"కొన్న ఆనందరావు స్వంత డబ్బుతో కొని పంపించేడు. అయితే ఆ తరవాత హార్లిక్స్, బోర్న్‌విటా, కోల్డ్ క్రీము, మల్లెపువ్వుల్తో సహా యిండెంట్ వచ్చింది. ఆనందరావు ఏదీ లేదనకుండా అన్నీ పంపించేడు బిల్లుతో సహా.

డి.యం.ఓ గారు "ధర్మప్రభువు" అనిపించుకున్నా ఆయన ధర్మపత్ని మాత్రం ధర్మ ప్రభువురాలు (క్షమించాలి ధర్మ ప్రభువుకి స్త్రీలింగం తెలీదు) కాకపోవడం వల్ల, ఆవిడ ఆనందరావుని క్షమించదల్చుకోలేదు.

అప్పటికి డి.యం.ఓ. గారు ఆ ఊరొచ్చి రెండురోజు లైంది. ఈ రెండు రోజుల్లో ఆయన ఊర్లోవున్న ఫ్రెండ్సింటికీ పార్టీలకీ వెళ్ళటంతోనో సరిపోయింది. హాస్పిటల్ ఉన్న వీధిలో ఆయన ఫ్రెండ్స్ ఎవరూ లేనందున ఆయన ఆ వీధిక్కూడా రాలేదు.

మూడోనాటి పొద్దున ఆయన హాస్పిటల్‌కి వచ్చేసరికి ఆనందరావు ఆపరేషను థియేటర్లో ఉన్నాడు.

"దొరగారొచ్చేరని" థియేటర్లోకి కబురొచ్చింది.

"అయితే నన్నేం చెయ్యమంటావు? బాజాలు తెప్పించాలా? మంగళహారతి యివ్వాలా? ఆయన పని ఆయన చూసు కుంటాడు. నా పని నేను చూసుకుంటాను" అని అంతలో మర్యాద జ్ఞాపకం వచ్చి అన్నట్టు "ఓ కప్పు కాఫీ యివ్వండి" అని కూడా చెప్పి మళ్ళా పనిలో మునిగి పోయేడు.

డి.యం.ఓ. గారేం చేశారో తెలియదు కాని, ఆనంద రావు వచ్చేసరికి అతని గదిలోనే కూర్చుని ఉన్నారు.

ఆనందరావు మర్యాదస్థుడైతే అతను బహు మర్యాదస్తుడు. అంచేత అతను మర్యాదగానే మాట్లాడి లేచిపోయేడు. అతను వెళ్ళిన అరగంటకి కబురొచ్చింది. ఫ్యామిలీ ప్లానింగు కేంపు తాలూకు అకౌంటు సెటిల్ చెయ్యమని, ఇతను ఆడిటరా? ఇన్‌కంటాక్స్ ఆఫీసరా? ఇతన్తో నేనెందుకు సెటిల్ చేసుకోవటం? అన్నాడు ఆనందరావు.

"కేంపు కింత" అని మామూలు రేటుంది. ఆ ప్రకారం పంపిచేయాల్సిందే అన్నారు స్టాఫ్.

"నే పనిచేస్తే యితనికెందుకు డబ్బివ్వాలి. పుచ్చుకోవటం అతని అలవాటేమో కాని, యివ్వటం నాకు అలవాటు లేదు. మమూలట దసరామామూలు అనుకున్నాడా" అని ఆ వచ్చిన వాడ్ని తిట్టి పంపించేశాడు.

డి.యం.ఓ. గారెంతటి ధర్మ ప్రభువులైనా ఆ ధర్మబుద్ధికైనా ఓ హద్దుంది. ఆనందరావు ఆయనచేత ఆ హద్దు దాటించేశాడు.

మరో వారానికి ఆనందరావుకి ఆనందరావుకి మేప్‌లో ఎక్కడా దొరకని ఊరికి ట్రాన్స్‌ఫరైపోయింది.

"ఈ ముష్టి ఉద్యోగం చెయ్యనంటుంటే నువ్వే త్రోశేవునన్నీ ధరిద్రంలోకి. అయిందా సంబరం రిజైను చేసేస్తాను" గెంతు తున్న ఆనందరావు చేత రెణ్ణెల్లు శలవు పెట్టించి వాళ్ళ వూరు పంపించేశారు మా వారు.

అదిగో, సరిగ్గా ఆ టైముకే వచ్చింది మైథిలి వాళ్ళింటికి. మరొక ఆడతోడు ఉంటే కాలక్షేపంగా ఉంటుందని అరుణ పుట్టింటివాళ్ళే పంపించేరుట మైథిలిని.

చుట్టరికపు పుస్తకం తిరగేస్తే మైథిలి అరుణకి చెల్లెలో అక్కో అవుతుందని మైథిలే చెప్పింది. చెప్పడమే కాకుండా మరి మీరు నాకేమౌతారు అనడిగింది ఆనందరావుని.

"వేలు విడిచా పట్టుకోనా?" అని అతనన్నప్పుడు "మీరెంత జోక్‌గా మాట్లాడుతారు" అని అతని "36 ఛాతిని 46" చేసింది.

మైథిలి ఎలా ఉంటుంది అన్న ప్రశ్నకి జవాబు చెప్పడం కష్టం. చక్కటి కళ్ళు, మంచి ముక్కు, అందమైన నోరు, చిన్న గడ్డం, ఇలా ఏవి ఎలా ఉంటే అందంగా ఉంటాయో అలాచేసి ఆఖర్న మొహంమీద ఓ గుద్దు గుద్దినట్టుంటుంది ఆవిడ మొహం. మరీ పొడుగు కాకపోయినప్పటికీ ఆడవాళ్ళలో పొడుగనే చెప్పుకోవచ్చు.

పొడుగ్గా ఉన్న తాటిచెట్టు పిడుగు నాకర్షించినట్లు పొడుగ్గా ఉన్న ఆడదే మొగాడినాకర్షిస్తుందని మొగవారి మెంటాలిటీలని స్టడీ చేసిన మైథిలి థియరీ.

"జిహ్వాకో రుచి" అన్నట్టు కొందరికి పసి పిల్లలంటే యిష్టం.

కొందరికి వయసులో ఉన్నవాళ్ళంటే యిష్టం.

చాలా తక్కువ మందికి ముసలి వాళ్ళంటే యిష్టం.

మైథిలికి మాత్రం పెళ్ళైన మొగాళ్ళంటే చాలా చాలా ఇష్టం.

ఆవిడ స్కూల్లో యస్.యస్.యల్.సి. దాటి ఎగరలేక పోయినా జీవితంలో మాత్రం మొగాళ్ళమీద రీసెర్చి దాటిపోయింది. మరంచేత ఎలిమెంటరీ లెవెల్లో ఉన్న ఆనంద రావుని అర్థం చేసుకోవడానికి అర రోజుకంటే ఎక్కువ పట్టలేదు.

వచ్చిన మర్నాడు...

వంట యింట్లో ఏదో పని చేసుకుంటోంది అరుణ. ఆనంద రావు ఏదో నవల చదువుకుంటున్నాడు వరండాలో కూర్చుని "ఏమన్నా పనుంటే చెప్పు, చేస్తాను" అంది మైథిలి చిక్కు తీసుకుంటూ వెళ్ళి వంటింటి గుమ్మం దగ్గర నిల్చుని.

నవ్వింది అరుణ, "నిజంగా పనిచేసేవాళ్ళు అడిగిచెయ్యరు. ఇద్దరికి సరిపోయే పనేం లేదు" అంది అరుణ. మైథిలి వెళ్ళి పోయింది చిక్కు తీసుకుంటూనే.

"ఈవిడ రోజులో సగం టైమంతా తల చిక్కుతీస్తూనే ఉంటుందేవిటో" అనుకున్నాడు ఆనందరావు దూరంగా నిల్చున్న మైథిలిని చూసి.

ఆనందరావు అనుకోవడం పూర్తి అయ్యేలోగా వచ్చేసింది మైథిలి "పేక ఆడతావా?" అంటూ.

"పేకా?" తేలుకుట్టినట్టు కెవ్వుమన్నాడు ఆనందరావు.

ఔను "పేకే" పక పక మంది మైథిలి.

"నాకు పేకంటే యిష్టం లేదు. పరమపాడు వ్యసనం" అన్నాడు ఆనందరావు.

చిక్కు తీసిన జుత్తు ముడివేసుకుంటున్నప్పుడు పైట కొంచెం పైకెళ్ళిందని తెలిసినా సర్దుకునే ప్రయత్నం ఏమీ చెయ్యలేదు మైథిలి. ముడివేసుకోవడం అయ్యేక "వ్యసనవా? ఏది వ్యసనం కాదు! మీరెప్పుడూ అలా చదువుతూనే ఉంటారు అది వ్యసనం కాదా?" అంది పక్కనున్న కుర్చీలో కూర్చుని.

ఆనందరావుకి ఆశ్చర్యం వేసింది. తనకి వ్యసనాలా? "ఇది అలవాటు, అంతే" అన్నాడు.

"అదేలెండి. మనకైతే అలవాటు అంటాం. ఎదుటి వాడికైతే వ్యసనం అంటాం. అంతే"

"పేకాట చెడ్డ అలవాటు కాదంటారా?" చంటి పిల్లాడు కాఫీ తాగకూడదా అన్నంత అమాయకంగా అడిగేడు.

"మంచి, చెడ్డ అనేవి విడివిడిగా ఉన్నాయంటారా?" ప్రతి దాట్లోంను మంచి, చెడ్డ రెండూ ఉంటాయి. అవి మనం తీసు కున్న మోతాదుని బట్టి ఉంటుంది. మాట వరుసకి "నిద్ర మాత్రలు ఒకటో, రెండో వేసుకుంటే హాయిగా నిద్రపోతాం. అన్నీ ఒకేసారి మింగేస్తే చచ్చిపోతాం. విషమైనా తగినంత మోతాదులో తీసుకుంటే ఏం చెయ్యదు. ఏవంటారు?"

ఇంతవరకు ఆనందరావు దగ్గర మంచి, చెడ్డల మీద లెక్చ రిచ్చిన వాళ్లెవరూ లేరు. అంచేత మైథిలి ధైర్యానికి అతను ఆశ్చర్యపోయేడు. ఆశ్చర్యంతో పాటు ఆవిడ థియరీ మంచిదేనే మోనన్న అనుమానం కూడా కలిగింది.

నిజానికతను ఆఫ్టరాల్ పేకాట గురించి అంత సీరియస్‌గా ఆలోచించలేదు. పుట్టినప్పటినుంచి పేకాట మంచిది కాదు అని విన్నాడు తరువాత కేవలం పేకాటవల్లే నాశనం అయి పోయిన ఒకరిద్దర్ని చూసి తను విన్నది నిజమని నమ్మేడు. అందులోనూ ఆడవాళ్ళు పేకాడ్డం మీద అతనికంత సదభిప్రాయం కూడా లేదు యింతవరకు.

మరికొంచెం ఎడ్యుకేషన్ అవసరం అనుకున్నదై మళ్ళీ ప్రారంభించింది. "ఇప్పుడు మనిద్దరం ఉన్నాం. కాలక్షేపం కావాలి. నాకు పుస్తకాలంటే యిష్టం లేదు. మరి కొంతసేపు పేకాడితే వచ్చే నష్టం ఏమిటో ఒక్కసారి చెప్పగలరా?"

నష్టం ఏమిటో ఆనందరావుకే తెలీలేదు. కాని తన నమ్మకాన్ని అంత సులువుగా వదలడం అతనికిష్టం లేదు.

"పేక ఒక్కటే ఆడాలని ఎక్కడుంది? కారమ్సు ఆడుకోవచ్చు..."

"చింతపిక్కలాడుకోవచ్చును, గవ్వలు ఆడుకోవచ్చును. మనం చిన్న పిల్లలవాఁ ఏమిటి? పైగా వాటిలో థ్రిల్ ఏవుంటుంది?"

మైథిలి నవ్వుకి ఆనందరావులోని అహం కస్సుమంది.

"పేకలో ఉన్న థ్రిల్ ఏవిఁటో!" అన్నాడు.

"ఆడాలి కదా మీకు తెలీడానికి!" అని ఆనందరావు మొహంలోకి చూసిన మైథిలికి "ఇదే కరెక్టు టైము" అనిపించింది.

అంచేత "ఓ పని చేద్దాం. ఈ వేళ సరదాగా ఆడదాం.

మీకు ఏ మాత్రం చెడు కనిపించినా ఏ మాత్రం థ్రిల్ లేక పోయినా రేపటినుండి ఆడొద్దు. ఏ విషయం గురించైనా మంచి చెడ్డలు నిర్ణయించడానికి ఆ విషయం గురించి క్షుణ్ణంగా తెలియాలి. ఒప్పుకుంటారా!" అన్న మైథిలితో ఒప్పుకున్నాడు ఆనందరావు.

మైథిలి చాకచక్యమో, ఆనందరావు తెలివితేటలో తెలీదు కాని పేకలో ఎన్ని ముక్కలుంటాయో తెలీని ఆనందరావు అరగంటలో పేకాట క్షుణ్ణంగా నేర్చుకున్నాడు.

వంట ఇంట్లో పనైపోయి వరండాలోకొచ్చిన అరుణకి పేకాడుతున్న ఆనందరావుని చూచి నోట మాట రాలేదు.

మనిషికి మార్పు సహజమే కాని ఆనందరావులోని ఈ మార్పు ఎందుకోగాని అరుణకి అంత మంచి అనిపించలేదు.

## 9

మొగాడి పతనానికీ, గొప్పతనానికీ కూడా వెనుక ఒక ఆడది ఉంటుందిట.

ఒకరు కాకుండా వందమంది ఉన్నా ఆ మగతనం పెరగదు. ఈ గొప్పతనవూ పెరగదు.

పతనం "వైరల్" లాంటిది. అది రానంతవరకే మన ప్రతిభ, వచ్చేక మరింక ఏ మందులూ లేవు.

ఆనందరావు గొప్పతనం వెనుక ఏ ఆడదీ లేదు.

కాని...

మైథిలి దగ్గర పేక నేర్చుకున్న ఆనందరావు, కొత్తగా సైకిలు తొక్కడం నేర్చుకుంటున్న కుర్రాడిలా తీరిక ఉన్నప్పుడల్లా మైథిలిలో పేక ఆడుతూనే ఉన్నాడు.

"ఎవడన్నాడు పేకాట వ్యసనవఁని! యింకా నయం. మైథిలి చెప్పకపోతే జీవితాంతం అదే గుడ్డి నమ్మకంలో ఉండేవాడ్ని. ఎంత మిస్‌లీడ్ అయిపోయేదుతను. కాలక్షేపంతో పాటు మంచి థ్రిల్ కూడా ఉంది. ఇప్పటికి పోగొ ట్టుకున్న థ్రిల్ చాలు. మరింక పోగొట్టుకోకూడదు" అని విచారించేడు కూడా.

ఆ మర్నాడు పని పూర్తి చేసుకున్న అరుణ "నాక్కూడా పంచండి" అంది చేతులు తుడుచుకుంటూ.

తుళ్ళిపడ్డాడు ఆనందరావు.

"నీకు రాదు కదా" అడిగేడు కలుపుతున్న పేక తాత్కాలికంగా ఆపి. అలవాటు ప్రకారం చిన్నగా నవ్వింది అరుణ

"అని నేనెప్పుడూ చెప్పలేదు"

"మరి నాతో ఎప్పుడు చెప్పలేదే" అతనా షాక్ నుంచి యింకా తేరుకోలేదు. అతని చేతిలో పేక తీసుకొని మైథిలి పంచుతోంది.

"అడగందే చెప్పడం నాకలవాటు లేదు" అంటూ ఆనందరావు పక్కనే కూర్చుంది.

అరుణకి పేకాట వచ్చునా, రాదా అన్నది కాదు అతని బాధ. మరి తనతో ఈ సంగతి చెప్పకుండా ఎందుకు దాచినట్టు తనువ వెయ్యిసార్లు చెప్పివుంటాడు. యిద్దరి మధ్య రహస్యాలు ఉండకూడదు అని. అయినా దాస్తూనే ఉంది. యిదొక్కటేనా? యింకా ఎన్ని దాచింది?

"అడక్కపోయినా చెప్పి ఉండాల్సింది"

"ఎందుకు?"

"దాచవలసిన అవసరం ఏవుంది?నా సంగతి తెలుసు కదా, ఎంత క్షమించరాని నేరాన్నైనా సరే వెంటనే చెప్పేస్తే క్షమిస్తాను. దాస్తే మాత్రం క్షమించలేను"

గుర్రం ఎటు వెళ్తుందో రౌతుకి బాగా తెలుస్తుంది.

ఆనందరావు ఎటు వెళ్తున్నాడో అరుణకి బాగా తెలుసు. అంచేత మాట్లాడకుండా ముక్కలు తీసుకుంది. ఆనందరావు అమాయకుడనీ, ఫూల్ అనీ అనుకుంటున్న మైథిలి తన అభిప్రాయం కొంచెం మార్చుకోవడం అవసరమేమో అనుకొంది. ఆ రెండింటితో పాటు యితనికి రవ్వంత మూర్ఖత్వం కూడా ఉంది. ఇప్పుడతనికి ఫుల్‌స్టాఫ్ పెట్టకపోతే రసాభాస చేసేస్తాడు. అంచేత "అందత క్షమించరాని నేరం అంటారా!" అంది.

సాధారణంగా మొగుడు, పెళ్లాం దెబ్బలాడుకుంటున్నప్పుడు మూడో వాళ్ళు వెళ్ళరు. ఒకవేళ అలా ఉండడం గనుక జరిగితే

మాట్లాడకుండా బైటికి వెళ్లిపోతారు. మరి మైథిలి అక్కడ ఉండడం నచ్చని అరుణకి ఆవిడ కలుగచేసుకోవడం యింకా నచ్చలేదు.

"పేక ఆట వచ్చునా రాదా అన్నది కాదు నా పాయింటు. ఎంత చిన్న విషయం దాచినా నాకిష్టం వుండదని తెలిసికూడా నా దగ్గర దాచటం వుందే డోన్ట్ లైక్ యిట్" అన్నాడు ఆనంద రావు. పంచిన ముక్కలు మౌనంగా పేర్చుకుంటోంది అరుణ. మళ్ళీ మైథిలి అందుకుంది "అసలు మీకు దేన్నీ లైట్‌గా తీసు కోవడం రాదా? యింత చిన్న విషయానికి యింత పెద్ద పోస్టు మార్టమ్ అనవసరమని నా ఉద్దేశం. మీకు కోపం రాదంటే ఒక్క మాటంటాను ఒక చిన్న 'కామాని' కాంప్లెక్స్‌సెంటెన్స్‌గా చేసే చాకచక్యంలో మీకు నోబెల్ ప్రైజు ఇవ్వవచ్చు. చూడండి ఆనందరావు గారూ లైఫ్‌లో ప్రతి చిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటే ఆఖర్న ట్రాజెడీ కాకమానదు. ఆడండి అవతల ముక్కలు పంచి అరగంటైంది అంటూ ముక్కలు అతనివేపు తోసింది.

మాట్లాడకుండా అందుకున్నాడు ఆనందరావు.

మొదట్లో మైథిలి తమిద్దరి మధ్యకి రావడం అంతయిష్టం లేకపోయినా, ఆనందరావు చేత అంతవేగం నోరు మూయించి నందుకు కించిత్తు సంతోషం కలిగింది అరుణకి. అంచేత "థ్యేంక్యు" అంది మైథిలి వైపు చూస్తూ.

ఆడదాని మనసు ఆడదానికే అర్థం ఔతుంది. ఆ "థ్యేంక్యు" కి జవాబుగా ఓ "నోమెన్షన్" నవ్వు నవ్వింది మైథిలి.

అరుణ తన దగ్గర తనకి పేకాట వచ్చునన్న సంగతి దాచి నందుకు కోపం యింకా తగ్గని ఆనందరావుకి యివేవీ అర్థం కాలేదు. అరుణ "థ్యేంకు" అనగానే.

"ఎందుకూ?" అన్నాడు.

"నాకింత మంచి ముక్కలు వేసినందుకు" అంది ఠక్కున అరుణ.

ఫక్కుమంది మైథిలి.

ఆవేశంతో అరుణతో ముభావంగానే ఉన్నాడు. అతని క్ోపం ఎక్కడానికి అరనిమిషం పట్టదు. దిగటానికి మాత్రం ఆర్రోజులు చాలదు–ఈ లోపున, మరోకోపం రాకుండా ఉంటే.

అందుకే "మావారెప్పుడుకోపం భోంచేస్తూ ఉంటారు. మధ్య మధ్య నన్ను నంచుకుంటూ" అంటుంది అరుణ నవ్వుతూ.

"నువ్వెలా నవ్వగలుగుతున్నావు" అని నాలాంటి వాళ్ళే వరైనా అడిగితే అతనికి శరీరానికి ముప్పై దాటాయో లేదో నాకు తెలీదు కాని మనసుకి మాత్రం మూడేళ్లు దాటలేదు. పసిపిల్లలేం చేసినా కోపం రాదు. అప్పుడప్పుడు చికాకు తప్ప" అంటుంది నవ్వుతూనే.

అయితే అంత నవ్వుకోగలిగిన అరుణక్కూడా అప్పు డప్పుడు కన్నీళ్ళు తెప్పించగల చాకచక్యం ఒక్క ఆనందరావు లాంటి వాళ్ళకే ఉంటుందేమో!

మొత్తానికి ఆవేళ మరింకా పేకాడలేదు అరుణ తనకి పనుందంటూ.

ఆడమని బలవంత పెట్టలేదు ఆనందరావు, మైథిలి.

వంటింట్లో పనిచేసుకుంటున్న అరుణకి వరండాలో ఉన్న వాళ్ళ మాటలు వినిపిస్తున్నాయి.

"కొంతమంది బతుకులు అంతే అంటున్నాడు" ఆనందరావు గాలిలో చేయి వేదాంత ధోరణిలో ఊపుతూ. ఆ క్షణాన అతని మొహం చూసిన వాళ్ళెవరికైనా "అయ్యో పాపం, పెళ్ళాం పోయింది కాబోలు" అనో లేకపోతే "ఉద్యోగం ఊడిపోయింది" కాబోలు అనో అనుమానం రాక మానదు.

"యిప్పుడు మీకు వచ్చిన కష్టం ఏమిటో" అడిగింది సోఫాలో కూర్చుని కాళ్ళూపుతూ.

ఆనందరావు మొహంలో యింకా దైన్యం వచ్చింది. ఈ సారి చూసినవాళ్ళు "పెళ్ళాం పిల్లలు ఒక్కసారేపోయేరు పాపం" అనుకుంటారు. "ఆవిడ అహంకారం చూసేరా?" పోనీ సారీ అనైనా అన్నదంటారా? ఎంత తప్పు చేసినా "సారీ" చెప్పి అయ్యా నాది తప్పై పోయింది అంటే క్షమించే మంచితనం నాలో ఉందని తెలుసు. అయినా "వీడెవడు అన్న నిర్లక్ష్యం" అంతే అన్నాడు.

మైథిలి ఊపే కాళ్ళని కొంతసేపు ఆపింది.

"ఆవిడకి తను చేసింది తప్పని అనిపిస్తే కదా మీకు సారీ చెప్పడం"

"నేను చెప్తే నమ్మకం ఉండదా. నేనెప్పుడూ పొరపాటుపడనే"

"అని మీరనుకుంటున్నారు. మిగిలిన వాళ్ళు కూడా అను కోవాలి కదా"

మళ్ళీ నిట్టూర్చేడు ఆనందరావు, "కాద్లెండి కొందరి బతుకు లంతే. మంచిగా బతుకుదావఁన్నా బతకనివ్వరు" అంటూ నీరసంగానే తీసుకున్నాడు పేక.

# 10

మరో రెండ్రోజులు గడిచేయి.

ఆ రెండ్రోజులు ఆనందరావు కోపం భోంచేస్తూనే ఉన్నాడు.

ఆవేళ మైథిలి సినిమా ప్రోగ్రాం వేసింది.

చిత్రం. ఆనందరావుకీ సినిమాలంటే చాలా యిష్టం గాని "ఆవిడకసలు లైఫ్‌లోనే యింటరెస్ట్ లేదు. ఎక్కడికైనా పీకకి తాడుకట్టి లాక్కెళ్ళాలి. నాకూ విసుగొచ్చి మానేశాను" అన్న ఆనందరావు వేపు జాలిగా చూడ్డం తప్ప మరేం చెయ్యలేక పోయింది.

"నేను రాను. మీ రిద్దరూ వెళ్ళిరండి" అంది అరుణ.

అరమైలు కోపం వచ్చింది ఆనందరావుకి.

"నీకసలు బుద్ధుందా? యింటికొచ్చిన అతిథి సినిమాకి వెళ్దాం సరదాగా రమ్మంటే రానంటావా? నీకసలు మర్యాద తెలీదు. కాని నా మర్యాద కాపాడ్డమైనా నీకిష్టం లేదు.ఎంత సేపూ నీ గురించి ఆలోచనే తప్ప పక్కవాడి గురించి ఆలోచించని స్వార్థం. యిప్పుడు నువ్వు లేకుండా మేమిద్దరమే తిరిగితే ఏవనుకుంటారు?" అతనెంత మెల్లిగా అన్నా మైథిలికి వినిపిస్తూనే ఉన్నాయి.

'అయితే మీక్కావలసింది నేను రావటం కాదన్నమాట. కేవలం మీ పరువు నిలబెట్టడానికేనన్నమాట. యింతకీ అనుకోవాల్సింది నేను. ఊళ్ళోవాళ్ళు కాదు" అని మనసులో అనుకున్నా బైల్దేరింది మైథిలి. ముందు మరో రభస యిష్టంలేక.

ఆనందరావుకి ఒక ప్రక్క అరుణ, మరొకపక్క మైథిలి.

ముగ్గురు నడుస్తున్నారు.

ఎందుకో పక్కకి తిరిగిన ఆనందరావుకి...

మైథిలి జుత్తుకు నూనె రాసుకొని నాలుగేళ్ళయింది.

ఆవిడ జడ అల్లుకుందో, విప్పుకుందో చెప్పడం కష్టం.

ఆవిడ జుత్తెప్పుడూ అప్పుడే నిద్రలేచినట్టు రేగి ఉంటుంది.

వీపు మీద జాకెట్టుకీ, చీరకీ మధ్య దూరం మైలుంటుంది.

వీపుమీద జాకెట్టుతో ఆడవాళ్ళ రుమాలు కూడా కుట్టలేం. గుండెల మీద ఒంటిపొర పైటలోంచి కనిపించవలసినవి కనిపిస్తూనే ఉన్నాయి.

భుజం మీద పిన్ను పెట్టగా మిలిన పైట అలా... అలా... గాలిలో ఎగురుతూ అప్పుడప్పుడూ పక్కవాళ్ళకి కితకితలు పెడ్తుంది.

చీరకీ, రోడ్డుకీ మధ్యలో పాదాలు కాని, చెప్పులు కాని కనిపించవు. ఆవిడెందుకో గాని నాలికతో అస్తమానం పెదవుల్ని తడు పుతూ ఉంటుంది.

ఆవిడ కళ్ళు కూడా వోల్టేజీ తక్కువై వెలిగే, ఆరే బల్బులా – అలా టపటప కొట్టుకుంటూనే ఉంటాయి.

మైథిలిని చూసిన మహర్షికి కూడా నమస్కారం పెట్టాలనిపించదు.

ఒక్క మాటలో చెప్పాలంటే ఆనందరావు కళ్ళకి ఆవిడ "ది వాకింగ్ ఏంజెల్"లా కనిపించింది. ఆనందరావులోని సౌందర్య పిపాసి ఒక్కసారి ఒళ్ళు దులుపుకున్నాడు.

వెంటనే రిఫ్లెక్స్ యాక్షనులో అరుణని చూసేడు.

అరుణ ప్రతిరోజు తలకి పులిషెడు నూనె రాస్తుంది.

నున్నగా దువ్వి, గట్టిగా అల్లిన జెడకొరడాలా ఉంటుంది.

భుజం చుట్టూ కొంగు కప్పుకోవడం వల్ల, వీపు మీద జాకెట్టుకీ, చీరకి మధ్య దూరం ఎవరికీ కనిపించదు.

చీరకీ, రోడ్డుకీ మధ్య కనిపించే పాదాలు పగుళ్ళతో నల్లగా ఉంటాయి.

అరుణని చూసిన ఏ మొగాడికీ కన్నుకొట్టాలనిపించదు.

"ఈ అంట్ల గిన్నెతోనా తను యిన్నాళ్ళు కాపరం చేస్తున్నాను" అని మొదటిసారిగా విచారించేడు ఆనంద రావు.

సినిమాహాల్లో రుక్మిణి, సత్యభామల మధ్య కృష్ణుడిలా కూర్చున్నాడని నవ్వుకుంది అరుణ. సినిమా పూర్తిగా చూసింది కూడా అరుణ ఒక్కర్తే. మైథిలి ఆనందరావు తాము యిదివరకు చూసిన సినిమాల గురించి మాట్లాడుకున్నారు.

గమ్మత్తు, ఆనందరావుకిష్టమైన హీరోనే మైథిలికీ యిష్టంట. మైథిలికి ఇష్టమైన పాటలంటే ఆనందరావుకి పిచ్చట. ఆనందరావుకి నచ్చని సినిమాలు మైథిలికి హారిబుల్. మైథిలి కిష్టమైన సాయంత్రాలు అలా బీచిలో కూర్చుని, సముద్రం వేపు చూడ్డం. ఆనందరావుకి వండర్‌ఫుల్. సినిమా పూర్తయ్యేసరికి యిద్దరివీ అభిరుచులూ, అలవాట్లు, యిష్టా యిష్టాలు, అయిష్టాలు అన్నీ ఒకరివి ఒకరికి అర్థం అయి పోయాయి.

అయితే ఈ యిద్దరూ అరుణకి పూర్తిగా అర్థం అయిపోయేరన్న విషయం మాత్రం వాళ్ళకి తెలీదు.

ఆ రాత్రి ముగ్గురూ నిద్రపోలేదు.

# 11

తెల్లవారడానికింకా గంట టైముంది.

పరీక్షలు దగ్గరకొచ్చిన పక్షిపిల్లలు తెల్లవారు ఝామునే లేచి గట్టిగా పాఠాలు చదువుకుంటున్నాయి.

"ఈ వచ్చిన చదువులు చాలు. తెల్లవారు ఝామునే ఓ కునుకు తీద్దామంటే ఏవిటో కాకిగోల" విసుక్కుంటున్నాయి ముసలి పక్షులు....

దూరంగా ఎక్కడో ఐదుగంటలు కొట్టేరు.

ఎటెండెన్సు పిలుస్తున్న మేష్టారిని నిద్రలోనే "ప్రెజెంట్‌సార్" చెప్పిన స్టూడెంటులా, ఆ గంటలు విన్న కోడి ఒకటి కునుకు తూనే "కొక్కొరోకో" అని కూసి మళ్ళీకళ్ళు మూసుకుంది.

చిన్నప్పటి అలవాటు ప్రకారం వాకిట్లో ముగ్గులు పెడుతోంది అరుణ. పండుగరోజులు కదా అని.

"చుక్కలు సరిగ్గా వచ్చాయో లేదో, వంకలు పెడితే బావుం డదు" కొంచెం వెనక్కి నడిచింది అరుణ.

ఎవరు తన వెనుక నిల్చున్నారు?

దెయ్యవా! దొంగా!

"నేను" అన్న ఆనందరావుని చూసి తెల్లబోయింది.

ఆనందరావుకి పొద్దున ఏడు లోపల లేస్తే తలనొప్పి ఎనిమిది గంటలలోపలైతే "ఎవర్నైనా చంపేద్దావన్నంత కోపం" వస్తాయి. ప్రాణం మీదికొస్తే తప్ప అతన్నెవరూ పొద్దునే లేపరు.

"సన్‌లైట్ చాలా బావుంటుందిట" అన్నాడు ఆనందరావే.

"మైథిలి చెప్పిందా?" అని అడుగలేదు అరుణ. మాట్లాడ కుండా చుక్కలు కలుపుతోంది.

"అరె, నువ్వు పెట్టేస్తున్నావా? నన్నూ లేకపపోయేవా? నేనూ పెట్టేదాన్ని" అప్పుడు వచ్చిన మైథిలి అరుణ చేతిలో ముగ్గు కొంచెం తీసుకొని, "నేను, అరుణ చిన్నప్పుడు ఎన్నిముగ్గులు పెట్టేవాళ్ళం అనుకున్నారు? ఇంకా అరుణకి జ్ఞాపకం ఉన్నాయి కాని నేనప్పుడే మర్చిపోయేను. అప్పుడలా అరుణదే ఫస్టు మార్కనుకోండి" అంది ఆనందరావుతో.

"ఆ ఆఖరి వాక్యం ఒక్కటే నిజం" అనుకున్నా పైకి ఏం అనలేదు అరుణ.

ముగ్గులు పూర్తయి వంటింట్లోకి వెళ్ళిన అరుణ వెనకాలే వెళ్ళేడు ఆనందరావు.

"ఈ వేళ పెసరట్లు చెయ్యకూడదూ! పాపం మైథిలి గారికి చాలా ఇష్టంట" అన్నాడు స్టవ్వు వెలిగిస్తున్న అరుణ వేపు కాకుండా గది గోడలవైపు చూస్తూ...

స్టవ్వు అంటించింది.

"అదిగో ఆ మాట్లాడక పోవడమే నాకు పిచ్చెత్తిస్తుంది.

అయినా ఇంటికొచ్చిన అతిథికేం కావాలో చూడాలన్న సంగతి నీకర్థం గాదు. అన్నీ నేనే చూసుకోవాలి. ఏమైనా అంటే నీక్కోపం. మొగాడ్ని ఎంతకని చూస్తాను" అని యింక డైలాగులు అయిపోయినట్టు వెళ్ళిపోయాడు.

ఏవిటీ మనిషితత్వం. యింటికొచ్చిన వాళ్ళు మనం పెట్టింది తింటారా? లేకపోతే వాళ్ళ యిష్టాలు కనుక్కోని మనం చేసి పెడతావా? ఈ మనిషికి బుద్ధి ఎప్పుడు వస్తుందో అనుకున్న అరుణకి యింత వేగం వచ్చే సూచన లేం లేవని ఆ వేళ సాయంత్రం సంఘటన నిరూపించింది.

ఆ సాయంత్రం....

"ఈ పూట నీ మైసూరు సిల్కు చీర మైథిలి గారికియ్యి. మొన్న నువ్వు కట్టుకున్నప్పుడు చూసిందట. చాలా బావుందని తెగ మెచ్చుకుంది. ఓసారి కట్టుకుంటే ఏమైపోతుంది?" అన్న ఆనందరావుని ఏమనాలో అర్థం కాలేదు అరుణకి.

తన చెల్లెలి పెళ్ళిలో, వదిన చీర తను కట్టుకుందని "డర్టీ హేబిట్స్, ఒకరి చీర మరొకరు, ఒకరి బాడీ యింకొకరు కట్టుకోవడం ఇ హేటిట్, తనకి బట్టల్లేకపోతే తలుపు లేసుకుని యింట్లో కూర్చోవాలి గాని మరొకరి బట్టలు వేసుకో కూడదు. అది నా ప్రిన్సిపల్" అని పెళ్ళి వారు వున్నారనైనా చూడకుండా తిట్టిన ఆ మనిషేనా ఈ మాట అంటున్నది?

మైథిలికి చీర యివ్వడానికి అరుణకేం అభ్యంతరం లేదు. కాని ఆనందరావులో వస్తున్న మార్పులు మాత్రం అంతగా నచ్చలేదు.

ఆడది తల్చుకోవాలే గాని, ఎంతటి మగవాడినైనా తన చుట్టూ కుక్కను తిప్పినట్టు తిప్పుకోగలదు.

ఈ నీతులు, ప్రిన్సిపల్స్, సిద్ధాంతాలు,నిజాయితీలు ఎంత గట్టిగా పట్టుకుంటే, అంత వేగం తెగిపోతాయేమో!

ఆనందరావు డేంజర్ లెవల్‌కి వెళ్ళడానికి యింకా ఎంతో దూరం లేదనిపించింది అరుణకి.

యితన్నింక రెండు కళ్ళతోనూ కనిపెట్టి కాపాడకపోతే తనకు దక్కడన్న భయం కూడా పట్టుకుంది.

మరో పావుగంటలో మొహం ఒత్తుకుంటున్న మైథిలి "ఏ చీర కట్టుకోను?" అంది పైకి స్వగతంతో.

ఆనందరావు మాట ఏనాడూ కాదనని అరుణ "నా మైసూరు సిల్కు చీర కట్టుకో" అంది ఆ చీర తీస్తూ..

"అబ్బే ఎందుకూ, నా చీరలు చాలా వున్నాయి. యిందు లోను ఏది కట్టుకోవడమో చెప్పు" అనలేదు మైథిలి.

"థ్యాంక్యూ సోమచ్" అంది చీర తీసుకుంటూ, ఆ సోమచ్ అన్న మాట అరుణ వెనకాల నిల్చున్న ఆనందరావుకి అన్న సంగతి అరుణక్కూడా తెలుసని వాళ్ళిద్దరికీ తెలీదు.

ఆ చీర కట్టుకొచ్చిన మైథిలిని చూసి ఆనందరావు కళ్ళలో మెరుపుకి అరుణ కళ్ళు జిగేల్మన్నాయి.

"అరుణా! మైథిలి గారికి ఆ చీర ఎంత బావుందో చూడు" అని అతనన్నప్పుడు పోనీ పాపం యిప్పటికైనా మనిషి బతకటం నేర్చుకున్నాడని అరుణ పడిన ఆశ అరనిమిషం కూడా నిలువ నివ్వలేదు ఆనందరావు.

"ఆ వేళ అరుణ ఈ చీర కట్టుకున్నప్పుడు మీరు చూడలేదు గాని పండుగనాడు గంగిరెద్దు వుంటుందే అచ్చు అలావుంది. పాపం అది ఆవిడ తప్పు కాదనుకోండి. వాళ్ళ బాబు అచ్చు అలాగే వుంటాడు మరి. అంతా తండ్రి పోలిక, ఆఫ్‌కోర్సు కూతురు తండ్రిని పోలితే అదృష్టం అంటారు. నాకంటే మంచి మొగుడెక్కడ దొరుకుతాడు? అదేమిటి అలా చూస్తున్నారు? ఆవిడేమైనా అనుకుంటుందనా? ఏం అనుకోలేదు. ఆవిడలో వున్న గొప్పతనం అదొక్కటే. లేకపోతే నేనెంత ఫూల్‌నంటారా?" అన్న ఆనందరావు ఎంత ఫూలో చెప్పలేదు మైథిలి.

మైథిలి కోరిక మీద ముగ్గురూ ఎగ్జిబిషన్‌కి బైల్దేరారు.

"ఐస్‌క్రీము తిందాం" అంది మైథిలి.

"నాకొద్దు మీరు తినండి" అంది అరుణ. ఈ రేటున తన దగ్గరున్న డబ్బు సరిపోతుందా లేదా అని భయపడుతూ.

ఆనందరావుకి వైద్యం వృత్తి. మాట్లాడ్డం హాబీ. ఆడియ న్సుంటే మాట్లాడేవాళ్ళకి యిన్‌స్పిరేషన్ వస్తుంది. ఆడ ఆడియన్సు అయితే మరి అడగక్కర్లేదు.

ఆనందరావు వీటికి అతీతుడు కాదు.

ఐస్‌క్రీము తింటామని వెళ్ళిన వాళ్ళు తిరిగి వచ్చేసరికి గంటన్నరైంది. వాళ్ళకోసం గంట వరకు చూసిన అరుణకి అలా తనొక్కర్తే ఆ స్టాల్ బైట కూర్చోవటం సిగ్గనిపించింది. ఎవరైనా పిచ్చిది అనుకుంటారో ఏమో, వాళ్ళేం చిన్నపిల్లలా ఏమిటి? తనెందుకూ అక్కడ పోలీసులా కాపలా? విసుకొచ్చి యింటి కెళ్ళిపోయింది అరుణ.

మరో అరగంట తరువాత యింటికొచ్చేరు వాళ్ళు. వస్తూనే "నువ్వు కనిపించకపోతే ఎంత గాభరా పడ్డాం" అనుకున్నాం అన్న మైథిలికి.

"నేను చిన్నపిల్లని కాను" అని మాత్రం సమాధానం యిచ్చి ఊరుకుంది అరుణ.

ఆ తరువాత భోజనం చేస్తున్నంతసేపూ ఆనందరావు అరుణ కనిపించక తను ఎంత భయపడ్డాడో, ఎలా ఫీలయ్యాడో, పాపం మైథిలి ఎంత వణికి పోయిందో తనెలా ఆవిడ్ని ఓదార్చాడో అసలలా చెప్పకుండా వచ్చేయటం ఎంత తెలివి తక్కువ పనో, అంతా వివరించి చెప్తూనే వున్నాడు. ఆఖర్న మాత్రం యింకె ప్పుడు ఇలాంటి బుద్ధి తక్కువ పన్లు చెయ్యద్దని వార్నింగు కూడా యిచ్చేడు.

మరోరెండ్రోజులు ఎవరూ ఎక్కడికీ వెళ్ళలేదు.

మూడోనాడు మైథిలి ఒక్కర్తే ఎవరో ఫ్రెండింటికి వెళ్తానని చెప్పి బైటికి వెళ్ళింది.

"యిన్నాళ్ళు లేని ఫ్రెండుయిప్పుడెక్కడ్నించి వచ్చేరు?" అనుకుంది అరుణ.

లేసు అల్లుకుంటున్న అరుణ ప్రక్కనే బుద్ధిగా కూర్చున్నాడు ఆనందరావు. లేసు అల్లిక ఆపలేదు అరుణ. "మైథిలి గారు చాలా మంచి ఆవిడ కదూ" అన్నాడు లేసుని యిటు అటు తిప్పుతూ.

అల్లుతున్న లేసు ఆపి ఒకసారి తలపైకెత్తి యీ ఉపోద్ఘాతం దేనికో "అన్నట్టు నవ్వి" నాకు తెలుసు అన్నట్టు మళ్ళీ తల దించి నేలని పడిన దారం ఉండకి చుడుతోంది. అదిగో ఆ నిర్లక్ష్యమే ఆనందరావుకి చికాకు.

నేనంటే నీకెప్పుడూ నవ్వే అనుకో కాని అప్పుడప్పుడూ కొంచెం అవతలి వాడు చెప్పింది సీరియస్‌గా విను.

"వింటున్నాను" అంటూ లేసు, దారం తీసి పక్కన పెట్టింది.

ఆనందరావుకి తనేవైనా మాట్లాడుతున్నప్పుడు ఎందుటవాడు అతి చిన్న పనిచేస్తున్నా కోపం వస్తుందని అతనేం చెప్పినా "యువర్స్ ఫైత్ ఫుల్లీ" అనాలని జ్ఞాపకం వచ్చి.

"మైథిలి గారు వెళ్ళిపోతానంటున్నారు" అన్నాడు పరో క్షంలో కూడా ఎవర్నీ అమర్యాదగా మాట్లాడని ఆనంద రావు.

"ఎన్నాళ్ళుంటుంది?"

"మరో నాలుగు రోజులుండమను"

"ఆ పని మీరే చెయ్యొచ్చు"

"నేనడిగితే ఏం బావుంటుంది?"

"యిదంతా బావుందా?" అన్లేదు అరుణ

"నీ దగ్గర నాకేం రహస్యాలు లేవు"

"చెప్పండి"

"ఆవిడకి నేనంటే వెర్రి అభిమానం. అంత అభిమానాన్ని నేను భరించలేను. పైగా అంత అభిమానించిన మనిషికి నేనేం చెయ్యలేకపోతున్నానే అని నా బాధ. నీ మంచితనం మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. నాలో చిన్న చిన్న తప్పులు ఎన్ని ఉన్నా, అందరి ఆడవాళ్ళలో ఉండే జెలసీ నీలో లేదు. అందుకే నువ్వంటే నాకు యిష్టం అరుణా... నా మాట నమ్ము. ఆవిడ అభిమానాన్ని నేను భరించలేక పోతున్నాను. ఏం చెయ్యమంటావో చెప్పు..." అంటున్న ఆనందరావు చెయ్యి పట్టుకొని ఛీఛీ బాధపడకండి అని మాత్రం అన గలిగింది అరుణ.

యితను నాకు మొగుడా? చంటిపిల్లాడా? ఎంత నిజాయితీ అయితే మాత్రం ప్రపంచంలో ఎవరైనా యిలాంటివి పెళ్లాంతో చెప్తారా? అసలు యిలాంటివి తెలిసి తెలీనట్లుంటేనే యిద్దరికీ మంచిది. అంతేకాని "నేనంటే ఫలానా ఆవిడకి యిష్టం నేనూ కాదనలేను ఏం చెయ్య మంటావు?" అని అడిగిన మొగుడికి ఏ ఆడదైనా ఏం జవాబు యివ్వగలదు? యింత దూరం వచ్చేక ఆగమంటే మాత్రం ఆగగలిగే శక్తి ఉందా? భగవాన్! యిలాంటి మనిషితో తను ఈ జీవితం అంతా గడపాలా? ఈ వేళ ఈవిడైంది, రేపు మరొకరు వచ్చి "నువ్వంటే నాకు ఇష్టం" మళ్ళీ ఇదే కథా? దీనికి అంతెక్కడ?

అసలు ఏది ధర్మం? ఏది అధర్మం?

ఆవిడ అభిమానాన్ని కాదనడం ఆవిడపట్ల అధర్మం అయితే, వయరి అది తనపట్ల ధర్మం ఔతుందా? యీ ధర్మాధర్మ జిజ్ఞాసలో పడితే ఎక్కడ తేల్తాం?

ఏదేమైనా మైథిలి ప్రయాణం తాత్కాలికంగా వాయిదా పడింది.

ఆనందరావు అమాయకుడు కాని అరుణ మాత్రం మనిషిని చూడకుండానే కడుపులో పేగులే కాకుండా, తలమీది వెంట్రుకలు కూడా లెక్క చెప్పగల సమర్థురాలు అన్న సంగతి మైథిలికి బాగా తెలుసు. ఆనందరావులో మొండితనం మూర్ఖత్వం అమాయకత్వం ఎంతైనా ఉండుగాక. అరుణంటే మాత్రం అతనికి లోపల ఓ విధమైన అభిమానం ఉందన్న సంగతి కూడా మైథిలికి తెలుసు. అదీగాక ఈ వెర్రిముండా వాడు ఎంత రహస్యం లేని వాడైనా వెధవది ప్రేమ వ్యవహారం కూడా పెళ్లాంతో సంప్రదిస్తాడా? ఆవిడ పెర్మిషను లేనిదే ఒక్క డైలాగు కూడా ఎక్కువ మాట్లాడడు. అదేం ఖర్మో అసలావిడ చూపు? "నీ వ్యవహారం అంతా నాకు ముందే తెలుసు" అన్నట్లు చూస్తుంది. నా మొగుడు నాతో చెప్పందే ఏ పని చెయ్యడు అన్న గర్వం. అదొక వెర్రిది.

అతనెందుకు చెప్తాడు?

బుద్ధిగా వింటుంది కాబట్టి,

అతనెందుకు ఆవిడ చెప్పినట్టు వింటాడు?

ఆవిడ ఏదీ వొద్దనదు కాబట్టి.

ఎందుకు ఒద్దనదు?

అప్పుడింక నా యిష్టం అంటాడేమోనన్న భయం.

అంతేగాని అతను చేసిన ప్రతి పనీ అరుణకి ఇష్టముండి ఒప్పుకోదు. యిష్టం లేకపోయినా తన మంచితనం నిలుపుకోవడానికి ఒప్పుకుంటుంది.

ఏవిటో? యిద్దరూ వెర్రివాళ్ళే అనుకుంది మైథిలి.

లేకపోతే అందరు మొగవాళ్ళలాగా అతను, అందరు ఆడవాళ్ళలాగా ఆవిడ ప్రవర్తిస్తే హాయిగా ఉండేవారు.

సూపర్‌మేన్‌లా ఉండాలని ఆనందరావు కోరిక.

స్పెషల్ ఉమన్‌లా ఉండాలని ఆవిడ ఆశ.

ఎందుకు స్పెషల్‌గా ఉండటం? అందరి ఆడవాళ్ళ లాగా వుంటే వచ్చే నష్టం ఏమిటి?

వాళ్ళిద్దర్నీ తల్చుకున్న మైథిలికి నవ్వొచ్చింది.

"ఏ సేక్ ఆఫ్ యిడియట్స్" అని కూడా అనుకుంది.

## 12

మైథిలి ప్రయాణం వాయిదా పడిన మర్నాటి నుంచి ఆనంద రావు చాలా ఆక్‌వర్డుగా ఫీలవడం ప్రారంభించాడు. రహస్యా లుండకూడదన్న ప్రిన్సిపల్ ప్రకారం అరుణతో చెప్పెదే తప్ప, ఆ మర్నాటి నుంచి మైథిలితో మాట్లాడుతున్న ప్రతిక్షణం అరుణ కళ్ళు తనని వెంటాడుతున్నట్లే ఉంది.

మనస్ఫూర్తిగా నవ్వలేకపోతున్నాడు. మనసారా మాట్లాడ లేకపోతున్నాడు. తను తప్పు చెయ్యటం లేదన్న నమ్మకం వెనుక తప్పు చేస్తున్నానేమోనన్న భయం లీలగా వెంటడుతోంది.

ఆ తరువాత అరుణ వాళ్ళతో బైటికి వెళ్ళలేదు. వాళ్ళూ రమ్మన లేదు. రోజులు ఎప్పుడూ ఒక్కలాగే జరగవు. ఒకనాటి సాయంత్రం –

"నిన్నోమాట అడుగుతాను. నిజం చెప్తావా?" అన్న ఆనంద రావుని చూసిన అరుణకి గుండె ఒక్కసారి గతితప్పింది. ఆనంద రావు అలా అడిగితే ఏదో కొంప మునిగిందన్న మాటే. ఇప్పుడు గాని అలవాటు ప్రకారం నవ్వి ఊరుకుంటే ఆ మునిగిన కొంప తేలదు.

"ఏఁవిఁటి!" తన గొంతు తనకే వినిపించలేదు.

"నువ్వు నన్ను యిష్టపడే చేసుకున్నావా?"

బాంబు పేలింది.

భూమి భద్ధలైంది.

ఆకాశం విరిగిపోయింది.

తను కూర్చున్నచోట నేల పగిలి తను కుర్చీతో సహా ఎక్క డికో, పాతాళంలోనికి, చీకటిలోకి వెళ్ళిపోతోంది.

ఏ ఆడది యీ ప్రశ్నకి సమాధానం చెప్పగలదు?

ఏ మొగుడికీ అలాంటి డౌట్ రాకూడదు.

వస్తే?

నిజం చెప్పినా నమ్మడు.

అబద్ధం చెప్పినా అంతే.

అరుణ గొంతుక తడారిపోయింది.

"ఇప్పుడెందుకు..." పొడిగానే అంది.

"ఎందుకంటే...." జరగవలసిందేదో జరిగిపోయింది. కాబట్టి నీ మూలంగా ఒక నిండు జీవితం బలైపోయింది కాబట్టి...

"నా కర్థం కావటం లేదు" మాటలు కూడబలుక్కుంది.

"నీ నిజాయితీ తెలుసుకుందాఁవని అడిగేను కాని నాకు నిజం తెలీక్కాదు. నువ్వు నన్ను చేసుకోనని ఏడిచేవు మామూ లుగా కాదు, అహోరాత్రాలు ఏడిచావు. అయినా మీ వాళ్ళు ఒప్పుకోలేదు. కానీ ఖర్చు లేకుండా డాక్టరు వస్తుంటే ఒదులు కొనేటంత తెలివితక్కువ వాడు కాదు మీ బాబు. నువ్వా నాడు నాతోనే గనుక చెప్పి ఉంటే ఈ పెళ్ళి జరగకుండా చూసేవాణ్ణి.

మంత్రించినట్టు వింటోంది అరుణ. ఇప్పటిలో ఆ ప్రశ్న ఎందుకొచ్చిందో అర్థం కాలేదు.

".... ఇప్పుడు నేను నీ ప్రేమ కోసం తపించిపోతున్నా ననుకోకు. దేహీ నన్ను ప్రేమించూ అని అడుక్కుంటున్నా నను కోకు... కాని యిప్పుడు నీ మూలంగా మైథిలి గారి జీవితం నాశనం అయిపోయింది. ఆవిడ్ని బలిచేసే అధికారం ఎవరిచ్చేరు నీకు? నువ్వూ ఆడదానివే. మరో ఆడదాన్ని అన్యాయం చెయ్య డానికి నీ మనసెలా ఒప్పింది?"

ఇందులో మైథిలి ప్రసక్తి ఎందుకొచ్చింది? తన పెళ్ళికీ మైథిలికీ ఏఁవిఁటి సంబంధం? అంతా అయోమయంగా ఉంది అరుణకి.

".... మైథిలి నిజంగా దేవత, అరుణా, దేవత. నీ కళ్ళకి నేను రాక్షసుడిలా కనిపించేను కాని, మైథిలి నన్ను ప్రేమిం చిందట.. కాదు ఆరాధించిదంట. కాని ఆ ఆరాధన తనలోనే దాచుకుంది. ఎందుకో తెలుసా? మనిద్దరిదీ మొదటి నుంచీ అనుకున్న సంబంధం. అకస్మాత్తుగా నేను నిన్ను కాక మైథిలిని చేసుకుంటే, నీలో ఏ లోపం లేకపోతే నిన్నెందుకు చేసుకోనని నీ మీద నిందపడితే మరింక నీకు పెళ్ళి కాదు. మైథిలికి చిన్న ప్పటి నుంచి నువ్వంటే ప్రాణం. మరంచేత నీ కోసం నన్ను త్యాగం చేసింది. అంత త్యాగానికి నువ్వు అర్హురాలినంటావా? అసలీ మంచితనాన్ని యింత త్యాగాన్ని నేను భరించగల నంటావా?" ఆవేశంతో ఆగేడు ఆనందరావు.

తను వింటున్నదేమిటి?

సినీమా కథా?

తెలుగు నవలా?

ఈ ఆరాధనేఁవిఁటి? ఈ త్యాగవేమిటి?

అరుణకి బుర్ర పనిచేయడం మానేసింది.

"... వెర్రిపిల్ల, నాతో మాట మాత్రం చెప్పి ఉంటే యింత అనర్థం జరక్కపోను. అంతే! నాలాంటి వాళ్ళు బాధలు పడ్డానికే పుడతారు. మైథిలి లాంటి వాళ్ళు త్యాగాలు చెయ్యడానికే పుడతారు. కాని నువ్వు... నువ్వు మంచిదాని వన్న గుడ్డి నమ్మకం నాకుండేది. అన్నీ తెలిసి, ఏంవీ తెలీనట్టు నటించగలవు. నువ్వు ఒక పెద్ద యాక్ట్రెస్‌వి. మనసులో ఒకటి పైకి మరొకటి చెప్పడమే కాకుండా, చెప్పి నమ్మించగల హిపోక్రట్‌వి. నీ సుఖం కోసం పక్క వాళ్ళని నాశనం చేసే స్వార్థపరురాలివి. నీ నిజం తెలిసి నిన్నేదో బాధలు పెట్టేస్తానని మాత్రం భయపడకు. ఎంతటి తప్పైనా క్షమించే ఔదార్యం నాలో ఉంది. ఇవన్నీ నీతో చెప్పి మైథిలితో మైమరచిపోతాననీ భ్రమపడకు. "ఒకే మాట, ఒకే భార్య" అన్న నీతి నాది. అంచేత నేనునిన్నేం చెయ్యను. కాని నువ్వు చేసిన అన్యాయం ఉందే అది..." ఆవేశంతో లేచి వెళ్ళి పోయాడు.

ఆనందరావు వెళ్ళిన మరో అరగంట వరకు అరుణకి అసలు అతనేవంన్నాడో సరిగ్గా అర్థం కాలేదు. ఎందుక న్నాడో కూడా అర్థం అవలేదు. ఆ తరువాత ఆ రోజంతా అతనన్న మాటల్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంది.

నువ్వు నన్ను యిష్టపడే చేసుకున్నావా? అని కదూ అడిగేడు ఎంత అర్థంలేని ప్రశ్న. అసలు ఆడపిల్ల ఇష్టాయిష్టాలు తెలుసు కొనే చేస్తున్నారా ఏ పెళ్ళయినా? ఒకవేళ నూటికి ఏ పదిమందో అడిగినా, ఏదో ఫార్మాలిటీకి తప్పిస్తే ఆ యిష్టాయిష్టాల్ని బట్టి ఎంతమంది నడుచుకుంటున్నారు. ఒకవేళ ఎవరైనా తనలాంటి వాళ్ళు ఒద్దని ఏడిస్తే మాత్రం ఎవరు వింటారు?

"నువ్వు చిన్నపిల్లవి" నీకేం తెలీదు. తల్లి, తండ్రి ఎప్పుడూ పిల్లలు సుఖపడాలనే అనుకుంటారు. పిల్లల మంచి మాకు తెలీదనుకుంటున్నావా? పెళ్ళయ్యాక అన్నీ అవే సర్దుకుం టాయి. ఈ చేసుకున్న వాళ్ళంతా యిష్టపడే చేసుకున్నారా? కాని వాళ్ళంతా లక్షణంగా సంసారాలు చేసుకోవడం లేదూ? మరం చేత పెద్దవాళ్ళ మాట కాదనక శుభ్రంగా చేసుకో అని నచ్చ చెప్పి ఊరుకోపెట్టేస్తారు.

"నాతో చెప్పలేకపోయేవా?" అన్నాడు ఎంత అసందర్భపు ప్రశ్న.

పెళ్ళి కాబోయే ఒక ఆడపిల్లకి, తనని చేసుకోబయే వాడి దగ్గరికి వెళ్ళి "నువ్వంటే నాకిష్టం లేదు. నేను చేసుకోను" అని తనంత తానుగా చెప్పగలిగే శక్తి ఉంటే ఎంతమంది బతుకులు నాశనం అవకుండా ఉంటాయో?

పోనీ ఒకవేళ తను నిజంగా తెగించి చెప్పివుంటే ఇంకెవరైనా అయితే ఏం చేసేవారో కాని ఆనందరావు మాత్రం అదంతా నాకు తెలీదు, మా అమ్మాకి మాటిచ్చే శారు మరింక తప్పను, మరింత అంతగా కావాలంటే తరువాత విడాకులు తీసుకో, కాని ముందు మాత్రం ఈ పెళ్ళి ఆపకు అని అతిమంచి కొడుకుగా అనేవాడు. ఆ తరువాత అతి చిన్న విషయాన్నిక్కూడా "నీకు నేనంటే యిష్టంలేద"న్న పాట పాడుతూ మామూలుగా వుండే సుఖం కూడా లేకుండా దాన్ని బతుకు అనరు.

నరకం అంటారు.

ఇంతకీ పెళ్ళి చేసుకున్నాక, తనకి అతను ఒక పసిపిల్లడు అన్న సంగతి అర్థం అయ్యేక మరింక అతనంటే అభిమా నమే ఉంది, జాలి ఉంది.

అతను తనతో సువర్చల సంగతి చెప్పినప్పుడు వట్టి పసి పిల్లడే కాదు, పరమ అమాయకుడని కూడా అర్థమైంది. అప్పటి నుంచి తనే అతనికి మొగ దిక్కుగా ఉంటోంది. అతనిలో ఈ నీతి, నిజాయితీ పిచ్చి, మంచి మట్టిగడ్డ వెర్రే కాకుండా, ఎవరేది చెప్పినా నమ్మే అతి భయంకర మైన గుణం కూడా ఉంది.

ఒకవేళ అకస్మాత్తుగా నేను చచ్చిపోతే?

ఇతని బతుకేం అవుతుంది? అన్న భయం కూడా అప్పు డప్పుడు వేసేది.

తనెప్పుడూ అతన్ని డబ్బుకోసం వేధించలేదు, డబ్బు అర్జించటం చేతకాదని నిందించలేదు.

పట్టు పరుపులు అడగలేదు.

బంగారం నగలు కాదు కదా స్టీలు సామాను కూడా అడగలేదు.

ఇలా గడిచిపోతే చాలనుకుంది.

కాని యిప్పుడీ మైథిలి మాత్రం యిలా గడవనివ్వదల్చు కోలేదు. అవును, అన్నట్టు తను ఈ పెళ్ళి వద్దని గోల చేసి నప్పుడు మైథిలి అక్కడే ఉంది.

కాని ఈ ప్రేమించటం, ఆరాధించటం ఏమిటి?

తనికి తెలీని మైథిలా?

పైగా అప్పుడేమంది? "అబ్బ అతను వట్టి నంగిరిగాడు!

తను అన్నదే తప్పు, ఎదుటివాడు చెప్పింది వినడు. నీలాంటి దైతే ఓర్పుగా భరిస్తుంది కాని నేనైతే మూడ్రోజుల్లో దెబ్బలాడి వెళ్ళిపోతాను. అలాంటి పిచ్చి మొగుడ్ని ఎవరు భరిస్తారు?" అని కదూ అంది.

అవును. ఆవిడన్న ఆ ఒక్కమాట మాత్రం నిజం!

నిజంగా పిచ్చి మొగుడే.

లేకపోతే ఆవిడ "నీ గుణాలున్న వాడు దొరికితే చేసుకుంటాను. నీ మంచి గుణాలు అన్నీ కాకపోయినా అందులో నాలుగో వంతు కూడా ఎవరికీ లేవు. అనడవూ:నూ, ఇతను నమ్మడవూనూ.

ఇప్పుడింక తను ఏం చెప్పినా, ఎలా చెప్పినా అతనికి అబద్ధమే ఔతుంది తప్ప ప్రయోజనం కూడా లేదు. తను ఎంత చెడ్డదైనా, మంచిదైనా మొగుడు మాత్రం మరో ఆడదానితో చనువుగా తిరగడాన్ని మాత్రం ఏ ఆడదీ భరించదు. తను మామూలు ఆడది, దేవత కాదు.

తను మామూలు మనిషిగా ప్రవర్తించకపోతే తప్పు! కాని దేవతలా ప్రవర్తించినందుకు ఎవరూ నిందించడానికి వీలులేదు.

అతనలా మైథిలిలో తిరుగుతున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు తను బాధపడ లేదనుకున్నవాడు బుద్ధిలేని వాడు! ప్రతిక్షణం తనలో లేనిది, మైథిలిలో ఉన్నది అతన్ని ఆకర్షిస్తున్నది ఏమిటని తను ఆలోచిస్తూనే ఉంది. తను ఎంత నరకం అనుభవిస్తున్నదీ తనకే తెలుసు! అయినా ఎవరికోసం భరించింది. అతని కోసం కాదూ! అతన్ని నొప్పించడం యిష్టంలేక కాదూ! అతన్నించి ఏం ప్రతిఫలం ఆశించింది? అంత బాధలోనూ నవ్వుకుంది అరుణ.

తను అడక్కపోయినా అతను మంచి ప్రతిఫలమే యిచ్చాడు.

నువ్వు వట్టి స్వార్థపరురాలివి.

నీ అంత హిపోక్రట్ లేదు!

ఫరవాలేదు. ఈ ఆఖరి సర్టిఫికెట్టు మాత్రం ఎందుకైనా పనికొస్తుంది.

యింతకీ యిప్పుడు తనేం చెయ్యాలి?

ఏం చేస్తే బావుంటుంది!

అతను తనని తిట్టేడన్న బాధకంటే తను యిప్పుడేం చెయ్యాలి అన్న బాధ ఎక్కువగా ఉంది.

ఆ రోజు, ఆ మర్నాడంతా ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చింది అరుణ. తను తీసుకున్న నిర్ణయం అమల్లో పెట్ట డానికి ఆలశ్యం చెయ్యటం ఆవిడకి అలవాటు లేదు.

## 13

భూమి తన చుట్టూ తాను తిరగడానికి ఒక రోజు పడుతుందిట. అదే భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365 రోజులు పడుతుందట.

అయితే నేను భూమిని కాను.

కాని మా వారి చుట్టూ 365 రోజులు తిరుగుతాను.

భూమి సూర్యుడి చుట్టూ ఎందుకు తిరుగుతుందో నాకు తెలీదు. నేను మాత్రం ఆ 365వ రోజున వెళ్ళబోయే సినీమా కోసం మా వారి చుట్టూ తిరుగుతాను. సినీమా దగ్గర కూడా సహగమనమేనా అని మావారు విసుక్కున్న ప్పటికీ.

ఆ వేళ 366వ రోజు.

మేమిద్దరం సినిమా సన్నాహాలు చేస్తున్నాం.

అదేం శాపమో కాని ఎప్పుడూ మావారి వస్తువులే కనిపించవు. లేవగానే బ్రష్ కనిపించదు. ఆ తరువాత తువ్వాలు, యింకా అలా అలా పడుకోబోయేముందు వేసుకునే కాంపోజ్ టాబ్లెట్ వరకు అన్నీ వెతకాల్సిందే.

అన్నిటికీ అన్ని నియామక స్థలాలు వున్నా, ఏదీ దాని స్థలంలో ఉండదు.

మా యింట్లో ఎప్పుడూ ఒక సెర్చిపార్టీ రెడీగా ఉంటుంది. మా వారి సామానులు వెతకడానికి.

అప్పుడు నేను మా వారి బెల్టు. మా చిన్నది ఆయన రుమాలు. మా ఆఖరివాడు ఆయన సిగరెట్టు పెట్టె వెతుకుతున్నాం.

మా ఆఖరి వాడికి సిగరెట్టు పెట్టె దొరకలేదు. కాని రుమాలు దొరికింది. చిన్నదానికి రుమాలు దొరకలేదు. కాని ఆ తరువాత వెతకబోయే అగ్గిపెట్టె దొరికింది. నాకు ఏదీ దొరకలేదు.

అప్పుడే వచ్చేడు ఆనందరావు.

అతను గెడ్డం గీసుకొని అప్పటికి ఆర్రోజులై ఉంటుంది.

బట్టలు మార్చుకొని బహుశా వారమై ఉంటుంది.

తలదువ్వుకొని ఎన్నాళ్ళయిందో చెప్పటం కష్టం.

ఆనందరావుని ఆ స్థితిలో చూసిన నాకు "యితనికేదైనా జబ్బు చెయ్యలేదు కదా?" అని భయం వేసింది.

"అదేవిటి అలా వున్నావ్? అరుణ రాలేదా? ఒంట్లో బాగో లేదా? అంతా కులాసాగా ఉన్నారా? సంగతేమిటి మాట్లా దవేం?" అని గబగబా అతన్ని ప్రశ్నల్తో కుదిపేశారు మా వారు.

అతనీ శలవులో ఉన్న దగ్గర్నుంచి ఏ జరిగిందీ మాకు తెలీదు. ఉత్తరాలు రాసే అలవాటు మాకు లేదు.

కుర్చీలో కూలబడి రెండు చేతుల్తోనూ మొహం కప్పుకున్న అతన్ని చూసిన నాకు కాళ్ళు గజగజ వణికేయి. కొంపతీసి అరుణకేమైనా..

ఆ తరువాత ఆలోచించడానికి నా మనస్సు ఒప్పలేదు.

"అరుణేదిరా?" కసిరినట్టే అడిగేరు మా వారు.

ఆనందరావు జవాబుగా ఓ కాయితం చేతిలో పెట్టాడు. అది చదివిని మా వారు.

"ఓరి ఫూల్!" అని మాత్రం అనగలిగేరు.

నేనూ చదివేను ఆ కాగితం, అందులో...

"మీరు హరిశ్చంద్రుడైతే నాకభ్యంతరం లేదు కాని నేను చంద్రమతిని కాలేను!"

అన్న రెండు లైన్లే ఉన్నాయి.

నేను, మా వారు చెరో కుర్చీలో కూలబడ్డాం.

కథంతా విన్నాక ఆనందరావుని చూసి అపరిమితమైన జాలి వేసింది.

అరుణని తల్చుకుని ఏడుపూ వచ్చింది.

**(1981)**

# డెడ్ కాపిటల్

"**గొ**డ్డయినా మనిషిని నమ్ముతుంది కాని, ఈ సుందరమ్మ తల్లి మాత్రం దేవుడితో సహా ఎవర్నీ నమ్మదు. నా తల్లి ఏ ముహూ ర్తాన పుట్టిందోకాని", అన్నది మా వారి కామన్ కంప్లయింట్.

అది గొడ్డు కొబట్టే నమ్ముతుంది.

ఇంతకీ నా నమ్మకంతోగాని, అపనమ్మకంతోగాని అయ నకేం అసంబంధం లేదు. ఆయన నమ్మకానికి కాలమానం ఒకటే. గురూగారూ అనే ప్రతి ప్రాణినీ ఆయన తన శిష్యకోటిలో చేర్చేసుకుంటారు. ప్రతి శిష్యుణ్నీ ఆయన నమ్ముతారు.

దేవుడికి భక్తులంతా ఒకటి ఔనో కాదో కాని నా పతి దేవు నికి మాత్రం అంతా ఒకటి కాదు.

అతి ముఖ్యులు, అముఖ్యులు, ముఖ్యులు యిలా రకరకాలు, అందులో ప్రమోషను, డిప్రమోషను కూడా వుంటారు.

నిజానికి మా వారి శిష్య పరమాణువుల్ని నేనంతగా పట్టిం చుకోను. వాళ్ళూ నన్ను పట్టించుకోరు, ఏదో గురుపత్నిగా ఓ నమస్కారం పారేస్తారు అంతే. అయితే ఒక్క సంగీతరావంటే మాత్రం నాకెందుకో.

అతను నన్నుప్పుడూ అగౌరవ పరచలేదు. సరికదా అందరి కంటే ఓ నమస్కారం ఎక్కువే పెడతాడు. పైగా అప్పుడప్పుడు "మీరు చాలా బాగా ఎంబ్రాయిడర్ చేస్తారనీ, మీ వంట అమో ఘం అనీ పొగుడుతాడు కూడా. అయినా అతనంటే నా కెందుకో అంత సదభిప్రాయం లేదు. దానిక్కారణం బహుశా అతను మా వారికి పక్క వాయిద్యం అవడంవల్లనేమో.

అబ్బ! గురూగారూ! అదిరిపోయిందనుకోండి. ఈ పెన్సిలు ఎక్కడ కొన్నారోగానీ ఓ డజను తేలేకపోయారా? అన్నాడు మా వారి దగ్గరున్న పెన్సిలు ముక్క చూసి.

దానికి మావారు శంకరుడిలా పొంగిపోయి "అదా... అదీ ... ఢిల్లీలో పేవ్‌మెంట్‌మీద కొన్నాను. డెడ్‌చీప్. రూపాయి పావలా. ఇది మీరు కావలిస్తే తీసుకోండి. నాకింకోటుంది. అని దాన్ని మాంత్రికుడు శిష్యుడికి మంత్రదండం యిస్తున్నంత జాగ్రత్తగా ఇచ్చేరు. అతనూ అంత భక్తిగానూ అందుకున్నాడు దాన్ని.

దాని ధర మా వూళ్ళో అర్ధరూపాయి.

మరోసారి అబ్బ! గురూగారూ! అంత వయసొచ్చినా ఏం కెపాసిటీ బాబూ మీది సోడా కూడా అడక్కుండా హాఫ్ బాటిల్ హూత్ అనిపించేశారు. మేమూ వున్నాం ఎందుకూ? రెండో రౌండుకి ఆఫ్ అన్నాడు మందుగ్లాసులో సోడా వేసుకుంటూ.

అంతే మా వారిలో శంకరుడు శివమెత్తేడు. ఆ తరువాత మిగతా హాఫ్ బాటిల్ గ్లాసు కూడా అడక్కుండా గడగడ లాడిం చేరు. ఆఫ్‌కోర్సు ఆ తరువాత రెండ్రోజులు మంచం దిగలేదు. అది వేరే సంగతి. నాకెందుకో మనం చేసే ప్రతి పనీ పొగిడేవార్ని నమ్మాల నిపించదు.